ప్రజాశక్తి

బుధవారం 22 మార్చి 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

సమస్యలపై ఆశా వర్కర్ల ధర్నా

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ఆశా వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు మణి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం విశాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ, ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భారం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో శిశు, మహిళల సంరక్షణకు వీరు చేస్తున్న సేవలను గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. మహిళ శిశు సంరక్షణ కాని పనులను ఆశా వర్కర్లకు అప్పజెప్పవద్దని విజ్ఞప్తి చేశారు. ఆశ వర్కర్లకు జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. సచివాలయంలో ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఉంచవద్దని, సెంటర్స్ క్లీన్ చేయడం, ఓపి వర్క్ వంటి పనులు ఆశాలతో చేయించవద్దని కోరారు. ఆశా వర్కర్లే రికార్డులు కొన్నుక్కోవాల్సి రావడం దారుణం అన్నారు. ఆశా వర్కర్లకు నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వకుండా ఆన్‌లైన్ వర్కు అప్పజెప్పవద్దన్నారు. వ్యాక్సిన్ బాక్సుల తరలింపు పని వీరితో చేయించడం భావ్యం కాదన్నారు. జీతాలకు సంబంధించిన కాగితాలను ప్రతినెలా డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయానికి తీసుకొస్తూ రవాణా చార్జీలు భరిస్తున్నారని తెలిపారు. ఎన్నికలు, పరీక్షల సమయంలో విధుల్లో ఉన్న ఆశా వర్కర్లకు తాగునీరు, భోజనం, బస్సు ఛార్జీలు కల్పించాలని ఆదివారం డ్యూటీలు వేయవద్దని, 62 సంవత్సరాల రిటైర్మెంట్ జిఒని వర్తింపచెయ్యాలని, కోవిడ్ కాలంలో (2020 మార్చి నుంచి) మరణించిన ఆశాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పుచేయాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు, 4జి సిమ్ ఇవ్వాలని, ఎఎన్‌ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజ్, గౌరవ వేతనం ఒకేసారి ఇవ్వాలని, ఆశ వర్కర్ల నియామకాలను ప్రభుత్వమే నిర్వహిచాలని, విధి నిర్వహణలో మరణిస్తే వారి కుటుంబాలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాల డ్యూటీలు చేయించరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.పద్మ, కార్యదర్శి వి.మేరీ, కోశాధికారి వై.సీతారత్నం తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి వినతి పత్రం సమర్పించారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మణి

జి-20 సదస్సుకు పక్కా ఏర్పాట్లు

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ వేదికగా ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న జి-20 సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సదస్సుకు వచ్చే అతిథులకు కూడా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. విఎంఆర్‌డిఎ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ దేశాలకు చెందిన అతిథులు రాక సందర్భంగా విమానాశ్రయంలో స్వాగతం పలికేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రోజు వారి కార్యక్రమాలు, వారి పర్యటనకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లకు తగు చర్యలు చేపట్టాలన్నారు. వారు బస చేసే హోటల్ వద్ద 24/7 హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేయాలని, ఈ హెల్ప్ డెస్క్‌లో రెవెన్యూ, జివిఎంసి, మెడికల్, పర్యాటక శాఖలకు సంబంధించి సిబ్బంది 3 షిఫ్టులుగా పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విమానాశ్రయంలోనూ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. జివిఎంసిలో కంట్రోల్ రూం నిరంతరం పనిచేయాలన్నారు. నగర సుందరీకరణ పనులుపై జివిఎంసి కమిషనర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్‌కు సూచించారు. కేంద్ర మంత్రులు రాక సందర్భంగా వారికి బస, లైజన్ ఆఫీసర్లు, ఎస్కార్ట్, వాహనాలు, తదితర ఏర్పాట్లు చూడాలని డిఆర్‌ఒని ఆదేశించారు. ఈ సదస్సుకు వచ్చే రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 27వ తేదీన 80 మంది ఫారన్ డెలిగేట్స్ విశాఖ రానున్నట్లు తెలిపారు. 28వ తేదీ రాత్రికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రానున్నారని చెప్పారు. అధికారులందరూ వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించి జి-20 సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్. విశ్వనాధన్, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, పలువురు అధికారులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మిగతా 2లో..

ప్రశాంతంగా ముగిసిన గ్లోబల్ సమ్మిట్, ఎమ్మెల్సీ ఎన్నికలు : జెసి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జిల్లాలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, అందుకు సహకరించిన ప్రతి అధికారికీ, సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యాన ఎన్నికల విధులలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణలో ప్రతి అధికారి, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేశారని తెలిపారు. ముున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించి విశాఖ జిల్లా కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, శిక్షణ ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్ ఉగాది శుభాకాంక్షలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగర ప్రజలకు జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, విశాఖ నగరాభివద్ధి జరగాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీలపై పోలీసుల నిర్బంధం ఆపాలి : ఐద్వా

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

జి-20 సదస్సుకు పక్కా ఏర్పాట్లు

పాల్గొన్నారు.

ఏర్పాట్లపై మేయర్ సమీక్ష

జి-20 సదస్సు ఏర్పాట్లపై మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులనడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో మంగళవారం ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, అదనపు కమిషనర్లు వర్మ, డాక్టర్ బి సన్యాసిరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ దామోదర్‌తో సమావేశమై జి - 20 ఏర్పాట్లపై ఆరాతీశారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి సుమారు 200 మంది అతిథులు వస్తున్నందున వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



యోగాలో పాల్గొన్న జివిఎంసి కమిషనర్ తదితరులు

ఆరోగ్యానికి యోగా అవసరం

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఎంజిఎం పార్కులో జి-20 సదస్సు సందర్భంగా భారతీయ యోగా విద్యను దేశ విదేశీయులకు పరిచయం కోసం సాధన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జి-20 సదస్సు విశాఖ నగరంలో జరగడం మనకు గర్వకారణమన్నారు. అతిథులకు భారతీయ సంస్కృతిలో భాగంగా యోగా సాధనతో స్వాగతం పలకడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించడం, విద్యార్థులకు యోగా తప్పని సరిగా నేర్పడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎస్ఎస్.వర్మ, వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్, డిసి (రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి నల్లనయ్య, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, జెడి (అమృత్) విజయభారతి, పీడీ (యుసిడి) కెవి.పాపునాయుడు, డిపిఒ చక్రవర్తి, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, బొడ్డేపల్లి రాము, సింహాచలం, మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్లు, ఇతర జివిఎంసి అధికారులు, యోగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యసనం ఆనందదాయకంగా సాగాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అభ్యసన విధానం ఆనందదాయకంగా సాగాలని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, నేటితరానికి అవసరమైన భవిష్యత్తు నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో డిజిటల్ యూనివర్సిటీలు రానున్నాయని చెప్పారు. ఆచార్యులు నిరంతరం అభ్యాసకులుగా మారాలన్నారు. అభివృద్ధికి కేంద్రంగా యువతరం నిలుస్తున్నారని తెలిపారు. గత ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని విభాగ దినోత్సవంలో చర్చించాలన్నారు. అనంతరం విద్యల్లో, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య కె.సమత, విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, విభాగ ఆచార్యులు కె.రమాసుధ, ఆచార్య శ్రీనునాయక్ తదితరులు ప్రసంగించారు.

డీఎస్సీ అభ్యర్థులను మోసగించిన వైసిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అధికారంలోకి వస్తే ఏటా జనవరి 1న నూతన జాబ్ క్యాలెండర్ ప్రకటించి మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి దాన్ని విస్మరించి నిరుద్యోగులను మోసం చేశారని ఎఐఎస్ఎఫ్ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు పేర్కొన్నారు. నాలుగేళ్ల నుంచి ఇళ్లకు దూరంగా ఉంటూ, కోచింగ్ సెంటర్లకు రూ.లక్షలు వెచ్చించి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న సమయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్రంలో 717 టీచర్ పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 50,896 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో 39008, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 11888 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నియామకాలు జరపకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తక్షణం 50 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలపై పోలీసుల నిర్బంధం ఆపాలి : ఐద్వా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అంగన్‌వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఈ నెల 20న చలో విజయవాడకు పిలుపునిస్తే పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని ఐద్వా విశాఖజిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మాట్లాడుతూ, రాజ్యాంగం ఇచ్చిన నిరసన తెలియజేసే హక్కును జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. అరెస్టులతో, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. గతంలో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని, న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని స్పష్టంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు సకాలంలో వేతనాలు, బిల్లులు చెల్లించడంలేదన్నారు. తెలంగాణా కన్నా అదనంగా రూ.1000 పెంచుతామని హామీ ఇచ్చారని, 2021 నుంచీ వర్కర్లకు రూ.13,650, హెల్పర్లకు, మినీ వర్కర్లకు రూ.7,800 ఇస్తున్నారని తెలిపారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారన్నారు.



సమావేశమైన ఐద్వా సభ్యులు

మెడికల్ రిప్రజెంటేటివ్స్‌పై దాడి పట్ల నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులపై బయోలాజికల్ కంపెనీ చేసిన అమానుష దాడిని వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ, బెంగళూరుకు చెందిన బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీ యాజమాన్యం కంపెనీ తరఫున పనిచేస్తున్న సేల్స్ రిప్రెజెంటేటివ్‌లను ఎటువంటి కారణమూ లేకుండా ఒకరిని సస్పెండ్ చేశారని, మరొకరిని వేరే రాష్ట్రానికి బదిలీ చేశారని చెప్పారు. బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీ సేల్స్ రిప్రెజెంటేటివ్‌ల సమస్యపై ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఎం.సంజయ్ కుమార్ ఈ నెల 13న బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీ మేనేజర్ కృష్ణ మోహన్ కెజిహెచ్ దగ్గర ఉన్న ఎల్‌జి హాస్పిటల్‌కి వచ్చారని తెలిసి అక్కడకు వెళ్లారని చెప్పారు. బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీలో పనిచేస్తున్న సేల్స్ రిప్రెజెంటేటివ్‌లను కారణం లేకుండా ట్రాన్స్‌ఫర్లు చేయవద్దని, టార్గెట్లు పెట్టి ఇబ్బందులకు గురిచేయొద్దని వినతి ఇచ్చారని తెలిపారు. ఇది జరిగిన రోజు అర్థరాత్రి రైల్వే కాలనీలోని సంజయ్‌కుమార్ ఇంటికి నలుగురు వ్యక్తులు దాడి చేయడానికి వచ్చారని, ఆయన ఇంట్లో లేకపోవడంతో ఫోన్ చేసి నానా దుర్భాషలాడారని వివరించారు. తనపై దాడి చేయడానికి ఇంటికి వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు సోమవారం స్పందనలో సంజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారని చెప్పారు. సంజయ్‌కుమార్ వచ్చి తనను తిట్టినట్లు బ్రిటిష్ బయోలాజికల్ మేనేజర్ కృష్ణమోహన్ తిరిగి మహారాణిపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు. ఇటువంటి చర్యలు తగవన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎర్ర శ్రీనివాస్, ఎం.సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణంపై నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వన్‌టౌన్ పరిధి చెంగలరావుపేట పంజా జంక్షన్‌లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని అపార్ట్‌మెంట్ నిర్మాణం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సిఐటియు నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబ జోన్ నాయకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న స్థలంలో కొంత భాగంలో ప్రభుత్వ గ్రంథాలయం ఉండేదన్నారు. గ్రంథాలయ భవనాన్ని పడగొట్టి అపార్ట్‌మెంట్ నిర్మిస్తుంటే జివిఎంసి అధికారులు ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ ఆక్రమణపై తాము స్పందనలో మూడు పర్యాయాలు ఫిర్యాదుచేసినా అధికారుల్లో చలనం లేదు సరికదా భవన యజమానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, శ్రీను, ప్రసాద్, బాయి సాహెబ్, వెంకటరావు పాల్గొన్నారు.



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

విజెఎఫ్‌లో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రజాపిత బ్రహ్మకుమారీస్, వైజాగ్ జర్నలిస్ట్ ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఉగాది సంబరాలు నిర్వహించారు. జర్నలిస్టులకు ఉగాదికిట్లు పంపిణీ చేశారు. పలువురిని సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉగాదితో ప్రారంభమయ్యే శోభకృత్ నామ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీ రామేశ్వరి, వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, విజెఎఫ్ ప్రతినిధులు నాగరాజ్ పట్నాయక్, దాడి రవికుమార్, ఎస్.వీరభద్రరావు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవస్థాపక దినం సందర్భంగా ఉద్యోగులు మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బిపి, సుగర్, కొలెస్ట్రాల్ తదితర వైద్య పరీక్షలు కూడా జరిపారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, తమ సంస్థ ఉద్యోగులు ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టడాన్ని అభినందించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ, 4జి నెట్ వర్క్ వెంటనే ఇవ్వాలని, వేజ్, పెన్షన్ రివిజన్ చేపట్టాలని, బిఎస్ఎన్ఎల్‌ను ప్రయివేటీకరించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరరావు, సత్యప్రసాద్, ఎస్.సురేష్‌కుమార్, పి.ఎల్చిరాజు, ఏడుకొండలు, మీనా కుమారి, ఉమా దేవి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

విద్యార్థులకు బెల్లంతో రాగి జావ పంపిణీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించిన అనంతరం విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ, జిల్లాలోని 587 పాఠశాలల్లో 87,861 మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో బెల్లం కలిపిన రాగి జావను అందిస్తారన్నారు. దీనిద్వారా విద్యార్థుల్లో ఐరన్, కాల్షియం పెరిగి రక్తహీనత లోపం తగ్గుతుందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, డిఇఒ చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున

సింహాచలం: 98వ వార్డు అడవివరం జెడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కింద బెల్లంతో రాగి జావ పంపిణీని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి వార్డు కార్పొరేటర్ పివి. నరసింహంతో కలిసి ప్రారంభించారు. వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఎర్రవరం, జెడ్‌సి మల్లునాయుడు హెచ్‌ఎం పైడిరాజు పాల్గొన్నారు.

భీమునిపట్నం : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 'జగనన్న గోరుముద్ద'లో భాగంగా బెల్లంతో కూడిన రాగిజావ పంపిణీని మంగళవారం పలు పాఠశాలల్లో లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేట ఎంపియుపి పాఠశాలలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు విద్యార్థులకు రాగిజావ పంపిణీ ప్రారంభించారు. సర్పంచ్ గాడు వెంకట నారాయణ పాల్గొన్నారు.నాలుగోవార్డు కాపులుప్పాడ ఎంపియుపి స్కూల్‌లో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, మూడవవార్డు సెయింట్ ఆన్స్ ప్రాథమిక పాఠశాలలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి మైలపల్లి షణ్ముఖరావు రాగిజావ పంపిణీని ప్రారంభించారు.

గోపాలపట్నం : 92వవార్డు గోపాలపట్నం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీని జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్ల అప్పలస్వామినాయుడు, వైసిపి నేతలు గేదెల మురళీకృష్ణ, గుంతిన నాగరాజు పాల్గొన్నారు

గాజువాక: 65వ వార్డు బాపూజీ కాలనీ, సంజీవ కాలనీ, భానోజీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీని వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ప్రారంభించారు. .కార్యక్రమంలో వైసిపి నేతలు మద్ది శంకర్‌రెడ్డి, గూన శ్రీనివాస్, దేముడు, ఆర్మీ సతీశ్, పెంద్ర రాజు, గొల్లపల్లి రాంబాబు, అడిగర్ల రమణ, జానా సతీశ్, అన్నాజీ, సుందరరావు, తెప్పల అప్పారావు, గిరి రాజు, వల్లభరావు, బాబ్జి, ఎల్‌వి.రమణ, చంటి రాజు, రామకృష్ణ, మంగ పాల్గొన్నారు

సీతమ్మధార: మధురానగర్ జివిఎంసి ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సీతంపేట విఎంసి కెఆర్‌కె పాఠశాలల్లో రాగిజావ పంపిణీని 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు. మధురానగర్, సీతంపేట స్కూల్ హెచ్‌ఎంలు అస్కరి, సరోజిని, దేముడుబాబు, స్కూలు చైర్మన్ సురేష్ వార్డుఎడ్యుకేషన్ సెక్రటరీ వినోద్ పాల్గొన్నారు.

కరాస: 52వ వార్డు కరాస ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు బెల్లంతోకూడిన రాగిజావ పంపిణీని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పంపిణీ చేసారు. చిన్నారులతో కలసి రాగిజావ రుచిచూశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డు సచివాలయ,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి : మండలంలోని ఎస్ఆర్ పురం, వాలిమెరక, జుత్తాడ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీని ఎంపిపి మధు పాడు నాగమణి ప్రారంభించారు. జుత్తాడ సర్పంచ్ చంద్రవాణి పాల్గొన్నారు

పద్మనాభం : మండలంలోని గంధవరం ప్రాథమిక పాఠశాలలో రాగిజావ పంపిణీని ఎంపిపి రాంబాబు ప్రారంభించారు. విద్యార్థుల్లో పోషకాల లోపం, రక్తహీనత నివారణతోపాటు ఆరోగ్యానికి వారంలో మూడు రోజులు జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావను అందజేస్తున్నట్లు తెలిపారు.

రెడ్డిపల్లి హైస్కూల్లో విద్యార్థులకు గ్లాసుల పంపిణీ

పద్మనాభం : జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రభుత్వం అందించే రాగిజావను పట్టుకుని తాగేందుకు వీలుగా రెడ్డిపల్లి హైస్కూల్‌లో 330మంది విద్యార్థులకు గ్లాస్‌లను స్థానిక జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు పంపిణీ చేశారు. విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రారంభించారు.

ఆరిలోవ: 10వ వార్డు పరిధి ఆదర్శనగర్, ఎస్ఐజి నగర్ ప్రాథమిక పాఠశాలలో ఎపి ఎడ్యుకేషన్ డవలెప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మీ, తోటగరువు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భవాని, 13వ వార్డు రామక్రిష్ణాపురం, ఆరిలోవ కాలనీ, శ్రీకాంత్‌నగర్, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలల్లో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత విద్యార్థులకు రాగి జావ అందజేసారు. పతివాడ కనకరాజు, కెల్ల సత్యనారాయణ, వీర్రాజు, వెంకట రెడ్డి, కె.శిరీషా, పాండ్రంకి శ్రీను, బాబూరావు, పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు వినతి

ప్రజాశక్తి -గాజువాక : 85వ వార్డులోని హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి నుంచి ఇ మర్రిపాలెం వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని టిడిపి నేత బలిరెడ్డి సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ, ఫార్మాసిటీ కాలనీ, గొన్న ఇంజినీరింగ్ కాలేజ్, ఎబిఎస్ స్కూల్‌తోపాటు అనేక పరిశ్రమలు, అలాగే హామీబాబా కేన్సర్ ఆసుపత్రి ఉండడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ బాగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కేన్సర్ ఆసుపత్రి నుంచి మర్రిపాలెం వరకు రోడ్డు విస్తరించి, అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, స్థానిక కార్పొరేటసర్ స్పందించి, కొత్త బడ్జెట్‌లో నిధులు కేటయింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పది విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలకగా, తొమ్మిదో తరగతి విద్యార్థులను పదో తరగతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వి.శంకరరావు మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలను బాగా రాసి, మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణులు కావాలని ఆశీర్వదించారు.

ల్యాబ్ టెక్నీషియన్ అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : ఆనందపురం మండలం, శొంఠ్యాంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో లాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సంతపేటకు చెందిన కర్రి సంతోష్‌రెడ్డి (35) ఈ నెల18న అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం...ఐటిఐ చదివిన సంతోష్‌రెడ్డి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో లాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు.ఆర్థిక సమస్యల వల్ల ఇంటి నుంచి బయటకు వెళ్తున్నట్లు పుట్టింటిలో ఉన్న భార్యకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చివెళ్లి పోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్ళ వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.దీంతో అతని తండ్రి వెంకటరెడ్డి మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన అయ్యన్నపాలెం వద్ద చోటు చేసుకుంది. న్యూపోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలివి. దయాల్‌నగర్‌కు చెందిన సిహెచ్ పైడయ్య (60) సోమవారం రాత్రి పెంటమ్మ గుడి దగ్గర సంతకు వచ్చాడు. ఈలోగా వర్షం రావడంతో రోడ్డు అనుకుని పెద్ద కాలువలో దిగిపోయాడు. అదే సమయంలో వర్షపునీటితో ప్రవహిస్తుండడంతో కొద్దిదూరం కొట్టుకుపోయాడు. పైడయ్య కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కాలువలో శవమైనట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కాగా మృతుడు పైడియ్య మూర్ఛవ్యాధి ఉండడంతో కాలువలో కొట్టుకుపోయి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో కజికిస్థాన్ దేశీయుడి అరెస్ట్

ప్రజాశక్తి -కంచరపాలెం: ఐదు కేజీల గంజాయి, పావు లీటర్ ఆశిష్ ఆయిల్‌తో కజికిస్తాన్ దేశీయుడిని ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. పోలీసులు విస్తృతంగా చేపడుతున్న తనిఖీల్లో భాగంగా పక్కాగా అందిన సమాచారంతో ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్, ఓ ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీ వద్ద గోవా వెళ్లేందుకు బస్సు కోసం నిరీక్షిస్తున్న కజకిస్తాన్ దేశీయుడిని తనిఖీ చేయగా అతడి నుంచి ఐదు కేజీల గంజాయి, పావు లీటర్ ఆశిష్ ఆయిల్‌ను పోలీసులు గుర్తించారు.

గడిచిన 30 ఏళ్లుగా గోవాలోనే ఉంటున్న నిందితుడు, అతని, స్నేహితులకి గంజాయి విరివిగా తీసుకునే అలవాటు ఉంది. గోవాలో 10 గ్రాముల గంజాయి రూ.1500 అమ్ముతుండడంతో, తక్కువ ధరకు దొరుకుతుందని తెలుసుకుని విశాఖకు వచ్చి, గంజాయి కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడికి గంజాయి అమ్మిన వ్యక్తి ఎవరు, అతడు ఎక్కడ నుంచి వచ్చాడు, ఎంతకు అమ్మాడు, వెనక గల ముఠా కదలికలు ఏమిటి, అన్న విషయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం నిందితుడి సెల్ ఫోన్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.. సౌత్ డిసిపి కె.ఆనంద్‌రెడ్డి పర్యవేక్షణలో వెస్ట్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి నేతృత్వంలో ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనాల కేసుల్లో ముగ్గురు మహిళల అరెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎయిర్‌పోర్టు, క్రైమ్, పెందుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన మూడు దొంగతనాల కేసుల్లో ముగ్గురు మహిళలను నగర పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి జి.నాగన్న వివరాలు వెల్లడించారు. 2023 మార్చి 10 గోకడా సంతోష్‌కుమారి తన ఆరు తులాల బంగారం చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు బండా నాగమణి (43), మడకల సంధ్య (23)ను నిందితులకు గుర్తించారు. వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరూ బాధితురాలికి స్నేహితులేనని తెలిపారు.

ఎయిర్‌పోర్టు, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 అక్టోబర్ 3న షేక్ హసీనాబీ ఆటోలో ప్రయాణిస్తుండగా బ్యాగు దొంగలించారని, అందులో 4 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదుచేశారు. 2023 ఫిబ్రవరి 28వ తేదీన సికింద్రాబాద్‌కు చెందిన జయంతి విజయలక్ష్మి ఆటోలో ప్రయాణిస్తుండగా బ్యాగును ఎవరో దొంగిలించారని, అందులో 8 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులలో కొత్తవలస 202 కాలనీకి చెందిన రావుల పార్వతి (31)ని నిందితులుగా గుర్తించారు. ఆమె నుండి చోరీకి గురైన 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

- భర్త వేధింపులే కారణమని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం గ్రామపంచాయతీ మీసాల వారి వీధిలో వివాహిత మీసాల సత్యవతి (37)అనుమానాస్పదరీతిలో ఉరేసుకుని మృతి చెందింది. ఆనందపురం గ్రామానికి చెందిన మీసాల సత్యంతో పాలవలస గ్రామానికి చెందిన సత్యవతితో 2006లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు.మృతురాలి భర్తకు వేరే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో దంపతుల మధ్య తరచూ విబేధాలు వస్తుండేవి. ఈ క్రమంలో వేధిస్తుండడంతో 2018లో ఆనందపురం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు.ఈ నేపథ్యంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సత్యవతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వేధింపుల వల్లే తన కుమార్తె మృతి చెందిందని సత్యవతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కారు, ఆటో ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కొత్తమల్లంపేట గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. చోద్యం నుండి నర్సీపట్నం వెళుతున్న కారు, గొలుగొండ నుండి కేడీపేట వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో, ఆటోలో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

వంతెనపై లారీ బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి -యస్. రాయవరం:మండలంలోని పి.ధర్మవరం బ్రిడ్జిపై లారీ బోల్తా పడిన ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం మేరకు.. మంగళవారం మధ్యాహ్నం విశాఖ నుండి తుని ప్రహరీ పలకలతో వస్తున్న లారీ, ఎడమవైపు నుండి వస్తున్న ఆర్టీసి బస్ తాకింది. దీంతో బ్రిడ్జి గోడను ఢీకొట్టిన లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌తో సహా లారీలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జగదాంబ సెంటర్ సమీపంలో రాఘవేంద్ర లాడ్జిలో ఓ యువకుడు ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సిఐ తిరుమలరావు కథనం ప్రకారం... గాజువాక ములగాడ హౌసింగ్ బోర్డు కాలనీ చెందిన బిరుసు రాజేష్‌కుమార్ (28) బిటెక్ చదువుకున్నాడు. హైదరాబాద్‌లో అమెజాన్ సంస్థలో కొద్దికాలం పనిచేసి తర్వాత మానేశాడు. విలాసాలకు బానిస అయిన అతడు కొద్ది కాలంగా తీవ్ర మనస్తాపంతో ఉన్నాడు. మాజీ ఆర్మీ ఉద్యోగి అయిన యువకుని తండ్రి ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో సెక్యూరిటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఖర్చులు కోసం తండ్రిని రాజేష్‌కుమార్ డబ్బులు అడిగాడు. తండ్రి లేదనడంతో ఇంట్లో వాళ్లకు ఫోన్ కూడా చేయడం మానేశాడు. ఈ నెల 15వ తేదీన రాఘవేంద్ర లాడ్జిలో దిగి నాలుగు రోజులు బస చేశాడు. రెండు రోజులుగా గది తలుపులు తెరుచుకోకపోవడం, తీవ్ర దుర్వాసన రావడంతో పోలీసులకు సిబ్బంది సమాచారం అందించారు. వాళ్లు తలుపులు తెరిచి చూడగా రాజేష్‌కుమార్ ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన ఇద్దరు మృతి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీ వంతెన చెక్‌పోస్టు మలుపు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై , విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.

పోలీసుల కథనం ప్రకారం...ఆరిలోవ, బాలాజీ నగర్, వివేకానంద కాలనీకి చెందిన ఎర్నింటి శ్రీనివాసరావు,(38) సమీప బంధువు, బుగత సూరిబాబు (46) విజయనగరం స్కూటీపై వెళ్లి తిరుగుప్రయాణంలో సొంతూరు వస్తుండగా, ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు స్కూటీని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలైన ఇద్దరిని సంగినవలస ఆసుపత్రికి, తర్వాత కెజిహెచ్‌కు తరలించగా,మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఎస్ఐ హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



మాట్లాడుతున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రాంబాబు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఆత్మూరి వెంకట భగవానులు అనే న్యాయవాదిపై నిరాధారాలతో కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం మేరకు కోర్టు విధులను బహిష్కరించి, న్యాయవాదులు నిరసన చేపట్టారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ, న్యాయవాదిపై పెట్టిన తప్పుడు కేసును వెనక్కు తీసుకోవడంతోపాటు బాధ్యులైన పోలీస్ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి సంఘటనలు పునరావృతం కాకుండా ఎపి డిజిపి పోలీసులకు తగిన సూచనలు ఇవ్వాలని బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్ కృష్ణమోహన్ కోరారు అనంతరం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద గంట సేపు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు కోశాధికారి పెళ్లి భాస్కరరావు, సీనియర్ న్యాయవాదులు ఎస్ఎస్ఎన్ రాజు, బాగ తులసీదాస్, బగాది తులసీదాస్, పల్కు శ్రీరామమూర్తి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు

ఆటో డ్రైవర్లకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 74వ వార్డు వెంపాల్‌నగర్ నూకాంబిక ఆటోస్టాండ్‌లో 17మంది డ్రైవర్లకు స్థానిక సత్యసాయి సేవాసమితి, భజనమండలి ఆధ్వర్యంలో జత బట్టలు, రూ.500 కుట్టుకూలీ మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వంశీరెడ్డిలు పాల్గొని, వీటిని అందజేసి, ప్రజలకు నూతన తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాబూరావు, రామారావు, గంధం సాయి, పోలీసునాయుడు, నూకంబిక అమ్మవారి ఆలయ కమిటీ, సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు..

ఆటోడ్రైవర్ నిజాయితీ

దొరికిన నగదు బ్యాగ్ పోలీసులకు అందజేత

ప్రజాశక్తి -మధురవాడ: మధురవాడ ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ ఎన్.లోకేష్ నిజాయితీని చాటుకున్నాడు. తన ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను, అందులోని నగదును పిఎంపాలెం పోలీసులకు అందజేశారు.



సిఐకి దొరికిన బ్యాగ్ ఇస్తున్న లోకేష్

సిఐ వై.రామకృష్ణ చెప్పిన వివరాలివి. మధురవాడకు చెందిన ఆటోడ్రైవర్ ఎన్.లోకేష్ ఆటోలో సోమవారం అక్కయ్యపాలేనికి చెందిన ఒక ప్రయాణికుడు ఎక్కి, హనుమంతవాకలో దిగిపోయాడు. ఆటో దిగిపోయే తొందరలో తన బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయాడు. దాన్ని గమనించిన ఆటోడ్రైవర్ లోకేష్ తెరిచిచూడగా, రూ.16,600 నగదు ఉన్నట్లు గుర్తించి, పిఎం పాలెం సిఐకి అప్పగించాడు. ఆటోడ్రైవర్ లోకేష్ నిజాయితీని సిఐ రామకృష్ణ అభినందించారు. బ్యాగ్‌కు సంబంధించి వ్యక్తి పూర్తి ఆధారాలతో పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తే ఇచ్చేస్తామని సిఐ తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం కలిగించొద్దు

ఇపిడిసిఎల్ చైర్మన్‌ను కోరిన ఎపిఎస్‌సిపిసిఆర్ సభ్యుడు సీతారాం



ఇపిడిసిఎల్ చైర్మన్‌తో మాట్లాడుతున్న సీతారాం

ప్రజాశక్తి-సీతమ్మధార: వచ్చే నెల మూడో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలకు, అనుబంధంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎపిఎస్‌సిపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం సూచించారు. మంగళవారం సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావుతో భేటీయై పలు అంశాలను చర్చించారు. విద్యుత్ బిల్లులు పెండింగ్, ఇతర సమస్యలను ఆసరాగా చేసుకుని, పది పరీక్షల కేంద్రాలుగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలపై పెండింగ్ విద్యుత్ బిల్లు బకాయిల వసూలుకు ఇదే సమయంలో ఒత్తిడి పెంచడం, నిలుపుదల చేయడం చేయొద్దని కోరారు. దీనిపై ఇప్పటికే కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. దీనిపై సంస్థ చైర్మన్ సంతోషరావు స్పందిస్తూ, ఇపిడిసిఎల్ పరిధిలోని 11జిల్లాల్లో బిల్లు బకాయిల వసూలు తాత్కాలికంగా వెసులుబాటు కల్పించడంతోపాటు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. భేటీలో బాలల సంరక్షణ జిల్లా అధికారి రమేష్, ఐసిడిఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీలత, లావణ్య, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు రజని, కనకలక్ష్మి, శిరీష, సిఆర్‌పిఎఫ్ ప్రతినిధులు డాక్టర్ బి.శకుంతల, పి.శేఖర్, డాక్టర్ జగ్గారావు పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస : ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక జంక్షన్‌లో మంగళ వారం నోటి ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. దంత వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని 'బి ప్రౌడ్ ఆఫ్ యువర్ మౌత్' అనే ప్లకార్డులు ప్రదర్శించారు. భీమిలి సిహెచ్‌సి దంత వైద్యులు డాక్టర్ డి సిద్దార్థకుమార్, సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల వైద్యులు శివ కుమార్, యశ్వంత్ సాయి, వర ప్రసాద్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుస్మిత, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

టిడ్కో ఇళ్ల డిపాజిట్ చెక్కుల వాపసు

ప్రజాశక్తి -కంచరపాలెం: 56 వార్డులో టిడ్కో ఇళ్ల కోసం గత ప్రభుత్వహయాంలో కట్టిన డిపాజిట్లకు సంబంధించిన చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం చాకలిగెడ్డ దయానందనగర్ గ్రామకమిటీ ఆధ్వర్యంలో నూకాంబికను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, సర్పసిద్ధ సాయిలత, ఎర్ని కుమార్, మజ్జి, దయానందనగర్ గ్రామ కమిటీ సభ్యులు 90వ వార్డు నాయకులు నమ్మి శ్రీను పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -గోపాలపట్నం : హెటిరో డ్రగ్స్ హెచ్ఆర్ ప్రతినిధి మణికంఠ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభను కనపరిచి 24 మంది ఉద్యోగం సాధించారని, కళాశాల ప్రిన్సిపల్ కె.మురళీమోహనరావు తెలిపారు. ఇంటర్వ్యూలో బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు 30 మంది పాల్గొనగా, వారిలో 24 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ నాయుడు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి టి సింహాచలం, అధ్యాపకులు పాల్గొన్నారు

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి -సీతమ్మధార: వైసిపి నేత, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ఈనెల 22 ఉగాది నుంచి 30 వరకు వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉగాది, శ్రీరామ నవమిని పురస్కరించుకుని 2018 నుంచి ఏటా కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ నెల 22న ఉగాది రోజున పెళ్లిరాట, 30న శ్రీరామనవమి,అదే రోజున కల్యాణోత్సవం, 31న రాములోరి పట్టాభిషేకం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ నమ్మి భీమవరపు శ్రీనివాసరావు, కోసబోయిన శ్రీనివాసరావు, ఇప్పిలి అప్పలనాయుడు, హరికృష్ణ, గణేష్, ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కరశర్మ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు 'పది' ప్రశ్నాపత్రాలు



పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్ పరీక్ష పత్రాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వచ్చేనెల మూడో తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష పేపర్లు మంగళవారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషనుకు చేరాయి. నగరంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలకు సంబంధించి సెట్1 పరీక్ష పత్రాలను పోలీస్‌స్టేషన్‌కు కస్టోడియన్ల ద్వారా చేరవేసినట్లు సంబంధిత అధికారి రాజారావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే వార్డుకు చెందిన పాల అప్పలరాము జ్ఞాపకార్థం అతని కుమారుడు నాయుడు సొంత నిధులు రూ.15వేలుతో కొనుగోలు చేసిన ప్రింటర్ బహూకరించారు. మంగళవారం వార్డు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు ద్వారా హెచ్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రింటర్ దాత నాయుడును పలువురు అభినందించారు. కార్యక్రమంలో వైసిపి నాలుగో వార్డు అధ్యక్షులు పాల రమణ, ఉపాధ్యాయులు ఎరుసు అప్పలకొండ పాల్గొన్నారు.



ప్రింటర్ అందజేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

వైద్య సాయానికి ఎదురుచూపు



అంపోలు హరీష్‌చంద్ర

ప్రజాశక్తి -మాధవధార : 50వ వార్డు తెన్నేటినగర్ ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల అంపోలు హరీష్ చంద్ర అనే బాలుడు ఆస్టియో ఆథ్రైటిస్ అనే ఎముకల సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యానికి ఆర్థికసాయం, చేయూత కోసం ఎదురుచూస్తున్నాడు. బాలుని తండ్రి మాధవరావు దినసరి కూలిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. బాధిత బాలుడు హరీష్‌చంద్రకు ఇంటర్నల్ రేడియాలజీ ద్వారా ఆపరేషన్ చేయాలని, ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ భవానీ ప్రసాద్ తెలిపారని బాలుని తండ్రి మాధవరావు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు అంత ఆర్థికస్తోమత లేదని, ఆపరేషన్, వైద్యఖర్చులకు దాతలు సహకరించాలని కోరుతున్నాడు.ఫోన్‌పే నెంబర్ 9393111607, ఎస్‌బిఐ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 30945181783 ద్వారా సాయం చేయాలని కోరుతున్నాడు.

న్యాయసేవలపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, కార్యక్రమాల్లో ప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ బులికృష్ణ కోరారు. మంగళవారం జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టిన పథకాలపై సోదాహరణంగా వివరించారు.కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు సిహెచ్ విశాలాక్షి, కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు పికె. లింగేశ్వరరావు, ఎల్డర్ లైన్ ప్రతినిధి ప్రసాదు, నేచర్ ఎన్జీవో ప్రతినిధులు ప్యానెల్ లాయర్ నాగభూషణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, టి నగరపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు తాళ్లవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు ప్రస్తుత దేశంలో హెచ్3 ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఉధృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఆసుపత్రి సిబ్బంది నాగేశ్వరరావు, రమణకుమారి, డివిఈఓ సిఎస్ఆర్ అధికారి నాగరాజు, నరసింహరావు, హెచ్ఎం గోవిందరావు, ఉపాధ్యాయులు సౌదామని పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రపంచ డౌన్స్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా ఆనందపురం భవిత విద్యా కేంద్రంలో సహిత ఉపాధ్యాయుడు కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్యుపరమైన లోపాలతో పిల్లల్లో డౌన్స్ సిండ్రోమ్ సమస్య వస్తుందని, ఒక ప్రత్యేక ముఖరూపాన్ని, మేధో వైకల్యాన్ని, మనిషి వృద్ధిలో లోపాలను కలుగజేస్తుందన్నారు. ఇది థైరాయిడ్ లేదా గుండె జబ్బులతో సంబంధం కలిగి ఉంటుందన్నారు. గర్భంలో ఉన్నప్పుడే వైద్యులు సలహాలతో తగు చర్యలు తీసుకుంటే జన్యుపరమైన దీనిని నివారించవచ్చన్నారు. ముఖ్యంగా మేనరికపు వివాహాల వల్ల ఎక్కువగా జన్యుపరమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఆనందపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె. అంజనాకుమారి, సహ ఉపాధ్యాయులు సహిత విద్య ఉపాధ్యాయురాలు ఐ .నాగమణి పాల్గొన్నారు

గంగవరం పోర్ట్‌లో బీచ్ పోషణ

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగాయారాడ బీచ్ సమీపంలో గురువారం బీచ్ పోషణ కార్యక్రమం చేపట్టారు. యారాడ బీచ్ వద్ద సముద్ర తీరంలో 1.4లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను పునరుద్ధరించడం ద్వారా బీచ్ క్లీనింగ్ చేపట్టారు. కనెక్టివిటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. గంగవరం పోర్ట్ లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గంగవరం, దిబ్బపాలెం, శ్రీనగర్ కాలనీ, జాలారి పల్లిపాలెం గ్రామాలలో నెలవారీ వైద్య శిబిరాలను నిర్వహించారు. వందమందికి ఉచిత వైద్యసేవలు,వెయ్యి మందికిపైగా కంటిరోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారిలో 340మందికి కళ్లద్దాలను పంపిణీ చేశారు.

కళలను ప్రోత్సహించాలి

- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

- తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు తెలిపారు. స్థానిక వివి రమణ రైతు భారతిలో సోమవారం రాత్రి జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ వారిచే నిర్వహించబడుతున్న తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975 ఎంహెచ్ స్కూల్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో డైమండ్ హిట్స్ సంస్థ ప్రోత్సాహంతో ఈ పోటీలు నిర్వహించడం హర్షనీయమన్నారు. కళా పరిషత్ కార్యదర్శి పి సి హెచ్ నాయుడు కలలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో తన భార్య సరళ పేరుతో కళాపరిషత్తు ఏర్పాటు చేసి పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కళలకు అనకాపల్లి పుట్టినిల్లు వంటిదని, నాటిక నాటకాలను ఇక్కడి ప్రజలు ఎంతో ఆదరిస్తారని చెప్పారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఆహ్వాన నాటిక పోటీలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం విజయవాడ వారిచే స్వర్ణకమలాలు నాటిక, 9 గంటలకు రాథోడ్ థియేటర్స్ చిలకలూరి వారి పేట వారిచే నాన్నా నేనొచ్చేసా నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిల్పరశెట్టి బాబి, వ్యవసాయదారుల సంఘం కార్యదర్శి విల్లూరి రాము, నిర్వాహకులు బొడ్డేడ జగత్ రావు, కె యం నాయుడు, భీశెట్టి కృష్ణ అప్పారావు, న్యాయ నిర్ణేతలు ధవళేశ్వర రావు, శేషగిరిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిరుధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి- మునగపాక రూరల్

చిరుధాన్యాలు పండించి రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చునని ఏడీఏ (డీఆర్సీ) టి.దాసు, సైంటిస్ట్ గౌరి సూచించారు. మండల కేంద్రంలోని పేట కొట్టు మూల సంఘం రైతులతో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజోస్ పిరిల్లామ్, పిఎస్‌బి, కెఆర్‌బి వంటి జీవన ఎరువులు గెత్తం కలిపి వేసుకోవాలన్నారు. చోడిలో చైతన్య వంటి రకాలను వేసుకోవాలని సూచించారు. సబ్సిడీలో సజ్జలు, రాగులు, ఊదలు, కొర్రలు వంటి విత్తనాలను సరఫరా చేయడం జరుగుతుందని, ఈ చిరుధాన్యాల పంటలను ఎంత మంది రైతులు వేసుకుంటారో జాబితాను ఆర్బీకే కేంద్రానికి సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవోలు విజేత, తులసి, మండలవ్యవసాయ అధికారిని జోష్నా కుమారి, ఏఈఓ లక్ష్మి, వి.ఎ.ఏలు శ్వేత, మీనన్, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, మూల సంఘం అధ్యక్షులు మల్ల జగ్గ అప్పారావు, టెక్కలి అప్పలనాయుడు, ఈశ్వరరావు, బొడ్డేడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పండగ కవులకు ప్రత్యేకం

ప్రజాశక్తి-అనకాపల్లి : కవులకు ఉగాది పండగ ప్రత్యేక పర్వదినమని కవి సమ్మేళనంలో పాల్గొన్న పలువురు సాహితీ మిత్రులు పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం శోభకృత్నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని అనకాపల్లి సాహితీ మిత్రులు, తెలుగు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సాహితీ వసంతం పేరిట కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవి గొంతిన రంగబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగు భాష పరిరక్షణ సమితి కన్వీనర్ కోయిలాడ రామ్మోహన్ రావు మాట్లాడుతూ ప్రపంచ కవిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సీనియర్ కవి మాధవి సనారా ఆధ్వర్యంలో రసవత్తరంగా సాగిన కవి సమ్మేళనంలో సుమారు 20 మంది కవులు పాల్గొని తమ కవితలు, పాటలు పద్యాలు ఆలపించారు. అనంతరం కవులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కే శ్రీనివాసరావు, కవులు ఇమ్మడిశెట్టి చక్రపాణి, రాయవరపు సరస్వతి, కోరాడ అప్పలరాజు, శిష్టా తమ్మి రాజు, వజ్రపు త్రినాథరావు, దేవరకొండ లక్ష్మి నారాయణ, భమిడిపాటి కాళిదాసు, గంప శ్రీదేవి, రేగులగడ్డ వెంకట లక్ష్మి గాయత్రి, నాగలక్ష్మి, వీరు నాయుడు, జిఎల్ఎన్ శాస్త్రి, సాయిబాబా, మల్లేశ్వరి, అమర జ్యోతి, లలిత, ఉమాదేవి పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న పలువురు కవులు

యుటిఎఫ్ కొత్త కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-సబ్బవరం

ఆంధ్ర ప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి, యాప్‌ల ఆన్లైన్ వర్కు నుంచి విముక్తి కలిగించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేసి, పాఠశాలను బలోపేతం చేయాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం యుటిఎఫ్ సబ్బవరం మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడుగా బి.నాగరాజు, అధ్యక్షులుగా సిహెచ్.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.తమ్మారావు, ఉపాధ్యక్షులుగా కెవి.రమణ, సహాధ్యక్షులుగా భీమేశ్వరిదేవి, కోశాధికారిగా ఎస్‌కె.అజారుద్దీన్, కార్యదర్శులుగా ఎన్. సోమేశ్వరరావు, త్రివేణి , భాస్కరరావు, జిల్లా కౌన్సిలర్‌గా బిఎస్ గోవింద, కె. విశ్వనాథం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి అభినందించారు.

మండలంలో భారీ వర్షం



భారీ వర్షం కారణంగా వేరుశనగ చేనులో చేరిన నీరు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ద్రోణి ప్రభావంలో మండల కేంద్రం దేవరాపల్లితో పాటు పరిసర గ్రామాలలో గత మూడు రోజుల నుంచి వర్షాలు దంచి కొడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. గాలి వానతో కురిసిన ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మామిడి, జీడి, అరటి, చింత పలు రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నేలకొరిగిన నువ్వు పంట

అచ్చుతాపురం : రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షం కారణంగా మండలంలో పల్లి గ్రామాల్లో నువ్వు పంట నేలకొరిగింది. ఈదురు గాలులు, వర్షం కారణంగా పంట దెబ్బతిందని రైతులకు తెలిపారు. కాయ కాసిన, పూత దశలో ఉన్న నువ్వు పంట, మొక్క దశలో ఉన్న మొక్కలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఇకపైన వర్షాలు పడకుండా ఉంటే కొంతవరకు నష్టం తగ్గుతుందని పేర్కొన్నారు. మండలంలోని హరిపాలెం, కొండకర్ల, జగ్గన్నపేట, ఘాజీపాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట తదితర గ్రామాల్లో నువ్వు పంటను వందలాది ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

స్వయం ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నిరుద్యోగ యువత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్వయం ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.పద్మ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, ఆంధ్రప్రదేశ్ ఖాదీ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లో ఎంతోమంది ఉపాధి పొంది స్వయం సమృద్ధి సాధించారని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా పరిశ్రమలను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. ఉత్పత్తి రంగ పరిశ్రమలకు 50 లక్షల రూపాయలు, సేవా రంగం పరిశ్రమలకు 20 లక్షల రూపాయలు రుణ సౌకర్యం 35 శాతం రాయితీపై లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి, ఏపీఓ సంజయ్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కిషోర్, కెవిఐసి ఎల్‌డి ఎం సత్యనారాయణ, ఖాదీ బోర్డు జూనియర్ ఇన్స్పెక్టర్ సురేష్, పరిశ్రమల ఏడి జోగినాథం తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ

సమగ్ర భూ రీ సర్వే వేగవంతం కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సంపూర్ణ భూహక్కు రీ సర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశించారు. మంగళవారం తహశీల్దారు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీ సర్వే పనులు ఏప్రిల్ ఒకటి నాటికి పూర్తి కావాలన్నారు. ప్రతి గ్రామంలో సీనియర్ అసిస్టెంట్ పర్యవేక్షణలో వీఆర్వో సమక్షంలో 100 శాతం సక్రమంగా ఉన్న రికార్డులను ఆన్లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే పై ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా ఉపతాసిల్దార్ శ్రీరామ్మూర్తిని నియమించడం జరిగిందని చెప్పారు. రైతుల సమన్వయంతో సంబంధిత ఎఫ్ఎంబి ఆధారంగా స్కెచ్‌లను సిద్ధం చేయాలన్నారు. పనితీరులో అలసత్వం నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డిటి శ్రీరామ్మూర్తి, ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తమ్ముడిపై దాడి కేసులో రెండేళ్ల జైలు

ప్రజాశక్తి-చోడవరం

భూత తగాదా నేపథ్యంలో తమ్మునిపై దాడి చేసిన అల్లూరి జిల్లా పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామానికి చెందిన సీదరి బాలన్నకు చోడవరం కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణ శ్రీ మంగళవారం రెండేళ్ల జైలు శిక్ష, 500 రూపాయలు జరిమానా విధించారు. ఈ కేసును అడిషనల్ పిపి వేచలపు వెంకటరావు వాదించారు. పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న భూమి విషయమై సీదరి బాలన్న, ఆయన తమ్ముడు రామారావు ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో బాలన్న రామారావుపై కత్తితో దాడి చేయడంతో రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పట్లో పాడేరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ కేసులో సాక్షులను విచారించిన కోర్టు బాలన్నకు శిక్షణ విధించి తీర్పు వెల్లడించింది.

అసంపూర్తిగా మండల సమావేశం

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన మంగళవారం జరిగిన చోడవరం మండల పరిషత్ సమావేశం అసంపూర్తిగా ముగిసింది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు సకాలంలో హాజరు కాలేకపోవడంతో వాయిదా వేయడానికి సిద్ధపడిన సమయంలో కొందరు ఎంపిటీసీ రావడంతో సమావేశం నిర్వహించారు. కనీసం గంట కూడా చర్చించకుండా ముగించి మామ అనిపించారు. ఈ సమావేశంలో సర్పంచులు ముఖ్య అతిథులుగానే ఉండాలని, వారి సలహాలు సూచనలు సమావేశంలో వ్యక్తపరచడానికి వీలు కాదని ఎంపీడీవో శ్యామసుందర్ అనడంతో కొంతమంది సర్పంచులు ఆయనపై అసహనం వ్యక్తం చేశారు. పాల్గొన్న ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ పనితీరు సరిగా లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కానీ ఆ శాఖకు సంబంధించి ఎఇ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో వారికి సమాధానం కరువైంది. ఉద్యోగులు అన్ని శాఖల వారు హాజరు కాకపోవడంతో ఏ విషయంపై సమగ్రంగా చర్చి జరగలేదు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడుక సత్యారావును వేదికపైకి పిలవకపోవడంతో ఆయన అలక పూని సమావేశం నుండి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బి తిరుమల బాబు, ఎంపీడీవో ఎస్‌డి శ్యామ సుందర్, వైస్ ఎంపీపీలు బుద్ధ గంగరాజు, బైన కుమారి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి గాడి కాసు తదితరులు

వైభవంగా నూకాలమ్మ పండగ మహోత్సవాలు



పాదయాత్రలో లోకేష్‌తో కలిసి నడుస్తున్న పైలా ప్రసాదరావు

లోకేష్ పాదయాత్రలో పైలా

ప్రజాశక్తి- కె.కోటపాడు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు మంగళవారం పాల్గొన్నారు. 49వ రోజు కదిరిలో లోకేష్ పాదయాత్ర సాగింది. ఈ పాదయాత్రలో విశాఖ, అనకాపల్లి జిల్లాల టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, లాలం భాస్కర్ రావు, డాక్టర్ చిరంజీవిరావు, గొంప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు


ప్రజాశక్తి-వడ్డాది

ఐసిడిఎస్ ద్వారా అంగన్వాడీలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ పిఓ ఉషారాణి తెలిపారు. బుచ్చయ్యపేట మండలంలోని లోపూడి-2, వడ్డాది-1 అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. పిల్లలు హాజరు పట్టికను పరిశీలించారు. పిల్లల మెనూ క్రమం తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. పిల్లలకు అందిస్తున్న వంటకాలను రుచి చూశారు. గోడపై ఉన్న చాట్లను చూపించి పిల్లలను ప్రశ్నించారు. పిల్లలు చెప్పే విధానం చూసి టీచర్‌ను, ఆయాని అభినందించారు. లోపూడి 2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎపిఓ పుష్ప, అంగన్వాడి కార్యకర్తలు కె జ్యోతి, అమ్మాజీ, హెల్పర్ సునీత పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు అన్నారు. మండలంలోని సీతయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఇందులో పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఎంపిపి దాకవరపు నాగేశ్వరిదేవి, నాగరాజు, సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీను, చైర్మన్ బాబురావు, హెడ్ మాస్టర్ ఏవి జగన్నాధరావు, కమటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యుడు దొండ రాంబాబు



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ పండగ మహోత్సవాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్య భక్తులు గ్రామాల్లోని నూకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని ఏ.కొత్తపల్లి, ఎం.అలమండ, కాశీపురం తదితర తదితర గ్రామాలలో నూకాలమ్మ ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పళ్ళు, కాయలు, పసుపు కుంకుమ, నూతన వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. ఏ.కొత్తపల్లి, ఎం.అలమండ గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత వర్షం తెరిపివ్వడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎ.కొత్తపల్లి, ఎం.అలమండ సర్పంచులు చింతల వెంకటరమణ, దాడి జగన్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినిపాలెం గ్రామంలో నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూకాంబిక ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకొని కుంకుమ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సత్యసాయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి, కేపీ అగ్రహారం గ్రామాల్లో నూకాలమ్మ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చోడవరం మాజీ శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు, పార్టీ మండల అధ్యక్షులు గోకువాడ కోటేశ్వరరావు తదితరులు ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. కేపీ అగ్రహారంలో మంగళవారం రాత్రి జిల్లాస్థాయి తప్పెటగుళ్ల పోటీలను నిర్వహించారు.

వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాది, బంగారు మెట్ట, పొట్టి దొరపాలెం, లోపూడి, గంటి కొరళం గ్రామాల్లో నూకంబిక అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు చీర జాకెట్ గాజులు పసుపు కుంకుమతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు జడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి, స్థానిక నాయకులు వడ్డాదిలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో నూకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదం స్వీకరించారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని దాలివలస గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండగకు టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ రూ.5వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కసిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుతాపురం, మోసయ్యపేట, కొండకర్ల, మడుతురు, మార్టూరు, చౌడపల్లి తదితర గ్రామాల్లో నూకాలమ్మ పండగ మహోత్సవాలు నిర్వహించారు. కొండకర్ల గ్రామంలో అగ్నిగుండం ఏర్పాటు చేసి భక్తులు అగ్ని గుండాలపై నడిచారు.

పరవాడ : పరవాడ గ్రామంలో నూకాలమ్మతల్లి పండుగ సందర్భంగా అమ్మవారిని ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు సందర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్‌లు పైల అప్పారావు, చుక్క రామునాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి : కొత్త అమావాస్యను పురష్కరించుకుని ఉపమాక గ్రామంలో సోమవారం రాత్రి గ్రామంలో నూకాలమ్మ తల్లి ప్రతిమలు (గరగలను) డప్పుల వాయిద్యాలతో ఊరేగించారు. మంగళవారం ఉదయం తాటి చెట్ల పేడలను పాతి వాటికి తాడుకట్టి ఊయలను తయారు చేసారు. ఈ ఊయలపై అమ్మవారి ప్రతిమలను (గరగలను) కూర్చొండబెట్టి ఊయల ఊపుతూ , పాటలు పడుతూ ఎంతో సందడిగా గ్రామపెద్దలు, యువకులు నిర్వహించారు. రామాలయం ఎదుట నీళ్ళతో శుభ్రంగా నేలను తడిపి కట్టెలతో నాగళి (ఏరులు) తయారు చేసి చిన్నారులతో నాగళి లాగించారు. ఇలా చేయడంతో సంవత్సరమంతా పాడి పంటలు సవమృద్ధిగా పండుతాయని ప్రజల నమ్మకం.

మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం నూకాలమ్మతల్లి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్త అమావాస్య సంధర్భంగా నూకాలమ్మ జాతర కోసం గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను అందంగా ముస్తాబు చేసారు. రంగులు వేసి విద్యుద్దీకరణతో అలంకరించారు.

నర్సీపట్నంటౌన్ : నర్సీపట్న, ఓఎల్.పురం, వేములపూడి, ధర్మసాగరం, మెట్టపాలెం, చెట్టుపల్లి, అమలాపురం నీలంపేట గ్రామాల్లో కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ పండుగ ఘనంగా జరిగింది. అబీద్‌సెంటర్‌లోని ఆలయం సోమవారం రాత్రి 12 గంటల నుండి భక్తులతో కిటకిటలాడింది. సరస్వతీ ప్రెస్ కూడలి వరకు భారీగా క్యూ కట్టారు. ఆలయ చైర్మన్ దనిమిరెడ్డి నాగు, సన్యాసిపాత్రుడు, మునిసిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, దనిమిరెడ్డి ప్రసాద్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కోటవురట్ల : మండలంలోని కైలాసపట్నం, కోటవురట్ల, వెంకటాపురం గ్రామాల్లో నూకాలమ్మను అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గొలుగొండ : మండలంలో లింగంపేటలోని నూకాంబిక దేవాలయంకు వందలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో తలనీలాలు సమర్పించడానికి, తాగునీటికి, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయం నుండి ప్రధాన రహదారి వరకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆధ్వర్యంలో భారీ విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో పలు దుకాణాలను ఏర్పాటు చేయడంతో భక్తులు భారీగా కొనుగోలు చేశారు.



యలమంచి ఆలయం వద్ద క్యూ కట్టిన భక్తులు

భారీ అంబలం పూజ

అనకాపల్లి : స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య నెలరోజుల జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని నూకంబిక మాలధారణ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద మంగళవారం భారీ అంబలం పూజ నిర్వహించారు. సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారి పాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



అంబలం పూజ చేస్తున్న నూకంబిక భక్తులు

భక్తురాలి బంగారం చోరీ

నర్సీపట్నంటౌన్ : నర్సీపట్నం నూకాలమ్మ తల్లి ఆలయంలో భక్తురాలి బంగారం చోరీ జరిగింది. నర్సీపట్నం మున్సిపాలిటీ వెంకునాయడు పేటకు చెందిన ప్రగడ సత్యవతి దర్శనానికి వచ్చారు. ఈ సమయంలో బంగారం చోరీకి గురైంది. దీంతో ఆలయం వద్ద కమిటీ సభ్యులకు, స్థానిక పోలీసు సిబ్బందికి బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని తారువ గ్రామానికి చెందిన రాయపురెడ్డి జమ్మయ్య కుమారుడు సూరిబాబు (సురేష్) గత నెల 11న స్టీల్ ప్లాంట్‌లో జరిగిన అగ్నిప్రమాదానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న నేపథ్యంలో వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మంగళవారం అందజేశారు. డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయంలో సూరిబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు.

నీటి సద్వినియోగంపై ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-చోడవరం : జలమే జీవనాధారమని, ప్రతి నీటి బొట్టును సద్వినియోగ పరచుకోవాలని చోడవరం మండల పరిషత్తు అధికారి శ్యాం సుందర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయ ప్రాంగణంలో మంగళవారం గ్రామ సర్పంచ్ భవాని అధ్యక్షతన ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సద్వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో నీటి దినోత్సవం జరుపుకోవడం ద్వారా నీటి విలువ, ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో మూడు అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వాడ్రేవు శేషగిరిరావు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం, వైస్ సర్పంచ్ గణపతి, ఎంపీటీసీ అబ్బాయి, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మృదుల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలోనూ, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 తేదీ వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. bit.ly/ap-kgbv-adm వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ ప్రవేశాలకు విద్యార్థి ఆధార్ కార్డు, తల్లి ఆధార్ కార్డు, తండ్రి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, స్టడీ సర్టిఫికెట్, పాస్ ఫొటో, మొబైల్ నెంబర్‌లు సమర్పించవలసి ఉంటుందని పేర్కొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

కొత్త అమావాస్య నూకాంబిక జాతర పురస్కరించుకొని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మంగళవారం పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బల్ల నాగభూషణం మాట్లాడుతూ పది సంవత్సరాలుగా నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో సంస్థ సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు ఆర్ మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్, ఆర్ చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

రాగిజావతో మరింత మెరుగైన ఆరోగ్యం

-కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి
-పలు పాఠశాలల్లో పంపిణీ



రాగిజావ పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-యంత్రాంగం

జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాల్లోని పలు పాఠశాలల్లో మంగళవారం ప్రారంభించారు. రాగిజావతో పౌష్టిక ఆహారం చేకూరుతుందని అధికారులు, నేతలు తెలిపారు.

అనకాపల్లి:రాగి జావతో రక్తహీనత వంటి పలు అనారోగ్యాలు దూరమవుతాయని, మరింత మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. స్థానిక జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 1435 పాఠశాలల్లో 1,24,747 మంది విద్యార్థులకు రాగి జావ అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అజయ్ బాబు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, గిరిజన సంక్షేమ శాఖ ఏటిడబ్ల్యూఓ నాగ శిరీష, డిప్యూటీ డీఈవో ప్రేమ కుమార్ పాల్గొన్నారు. సీతానగరం, అక్కిరెడ్డి వానిపాలెం. తారకరామకాలనీ పాఠశాలల్లో రాగి జావ పంపిణీని ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఎంపీడీవో ధర్మారావు, ఎంఈఓ దివాకర్ సత్యనారాయణపురం పాఠశాలలో సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి పంపిణీ చేశారు.

మునగపాక రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని చేపట్టారు. జడ్పిటిసి పెంట కోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మల్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంఈఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ పరిధిలో 20వ వార్డు పెద్దపల్లి ప్రభుత్వ పాఠశాలలో రాగిజావను కౌన్సిలర్ దాసరి చిన్నమ్ములు కుమార్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం బాలు, స్కూల్ చైర్మన్ బిఎల్‌వి రాజు, దుంగ అచ్యుతరావు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో రాగి జావను సర్పంచ్ బండి నూకలమ్మ పంపిణీ చేశారు. ఎంఈఓ శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, వైసిపి నాయకులు దేవరపల్లి సత్య, గూనూరు సత్యనారాయణ, బండి శ్రీను, ఒరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం, తాళ్ళపాలెం పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, ఎమ్‌పిటిసి లగిశెట్టి భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మల్లు నాయుడుపాలెం హైస్కూల్లో ఎంఇఒ ఆధ్వర్యంలో నిర్వహించిన రాగిజావ పంపిణీలో జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపిపి బోకం సూర్యకుమారి రాముసాయుడు పాల్గొన్నారు. గుల్లేపల్లి, రావలమ్మపాలెం, సబ్బవరం పాఠశాలల్లో సర్పంచ్‌లు బండారు మంగ శ్రీనివాసరావు, నారాయణ మూర్తి ప్రసాదరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి మెయిన్ స్కూల్లో రాగిజావ కార్యక్రమాన్ని ఎంపిపి కలవర్తి రాజేశ్వరి భాస్కరరావు ప్రారంభించారు. ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, ఎంఈఓ సిహెచ్ రవీంద్రబాబు, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, హెచ్ఎం కృష్ణ స్వామినాయుడు పాల్గొన్నారు. మండలంలోని కొత్తపెంటలో సర్పంచ్ రొంగలి వెంకటరావు రాగిజావ పంపిణీ చేశారు.

బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట, దిబ్బిడి పాఠశాలల్లో జడ్పిటిసి దొండ రాంబాబు ప్రారంభించారు. సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కరణం నాగేశ్వరావు, స్కూల్ కమిటీ చైర్మన్ వజ్రపు బాబురావు, హెచ్ఎం ఏవి జగన్నాథరావు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట, వడ్డాది పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి, హెచ్ఎం పివి శేషగిరిరావు, సిహెచ్ దుర్గ భవాని పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని పూడి వైయస్సార్ నగర్ కాలనీలో సర్పంచ్ లాలం వాణి వాసు రాగిజావ పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఈఈత బాబురావు పాల్గొన్నారు. మల్లవరంలో సర్పంచ్ పిన్నమరాజు వాసు, నరేంద్రపురంలో ఎంపీటీసీ రావి నాగలక్ష్మి శోభన్ బాబు, తంతడిలో రాజాన అప్పారావు, జగ్గన్నపేట పాఠశాలలో దొడ్డి వెంకటలక్ష్మి రాగిజావ పంపిణీ చేశారు.

పరవాడ : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీని ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు ప్రారంభించారు. పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు ఎమ్ఇఓ సునీత, హెచ్‌ఎమ్ కుమారి పాల్గొన్నారు.



నర్సీపట్నం మండలంలో..

నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం భవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. ఎంపీపీ రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీడీవో సీతారామరాజు, ఎంపీటీసీ సభ్యులు బచ్చల రాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఈశ్వరరావు, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు పాపారావు, కోమర్తి బాబూరావు పాల్గొన్నారు.

కోటవురట్ల:చిన్నారులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ప్రభుత్వం రాగి జావ పంపిణీ చేపడుతుందని మండల విద్యాశాఖ అధికారి అప్పారావు తెలిపారు. కైలాసపట్నంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, గ్రామ సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిపి గజ్జలపు మణికుమారి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బోస్ భారతిలు ప్రారంభించారు. విద్యా కమిటీ చైర్మన్ రామలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చీడిగుమ్మల పాఠశాలలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, జోగుంపేట పాఠశాలలో వైస్ ఎంపిపి జక్కు నాగమణి, సర్పంచ్ జువ్వల లక్ష్మీ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

ఎస్.రాయవరం:బావి భారత పౌరుల ఆరోగ్య భద్రతే రాష్ట్రప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పిఏసీఎస్ అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్రరాజు అన్నారు. కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావను విద్యార్థులకు అందించి పథకాన్ని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమరావు, సర్పంచ్ కోరపాటి గోపాలం, విద్యా కమిటీ చైర్మన్ జానకిరాధా, డ్రిల్ మాస్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రావికమతం:కవగుంట ఎంపీ యూపీ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, చైర్మన్ నాయుడు చేతుల మీదుగా రాగి జావా పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ ప్రగడ నాయుడు బాబు, ఉపాధ్యాయులు దేవి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంరూరల్:మండలంలోని యరకన్న పాలెం, వేములపూడి పాఠశాలలో విద్యార్థులకు రాగి జావను ఎంపిపి సుర్ల రాజేశ్వరి పంపిణీ చేశారు.సర్పంచ్ నారాయణమ్మ, హెచ్ఎం వరప్రసాద్ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

భూముల రీ సర్వే వేగవంతం చేయాలి

ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో చేపడుతున్న భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని ఆర్డీవో జయరాం ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలో జరుగుతున్న రీ సర్వే గ్రామాలను సందర్శించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రీ సర్వే పట్ల సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని 140 గ్రామాల్లో ప్రస్తుతం 33 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా అసైన్డ్ భూములు, రికార్డుల మార్పునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో 3 ఎకరాల భూ పంపిణీకి చర్యలు చేపట్టనున్నామని, ఇందు నిమిత్తం సబ్ డివిజన్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు జానకమ్మ, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి కథనంపై స్పందన

ప్రజాశక్తి-కోటవురట్ల:అపారిశుద్యానికి కేరాఫ్ అడ్రస్ అంటూ సోమవారం వచ్చిన ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి రహదారులు భవనాల శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా రహదారుల భవనాల శాఖ డిప్యూటీ ఇంజనీర్ కెఎస్ ప్రభు ప్రజాశక్తి కథనానికి స్పందించి, ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ, కొడవటిపూడి రహదారి నిర్మాణానికి 2.40కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని, ఎన్నికల కోడ్ కారణంగా మంజూరు నిధులు ప్రకటన చేయలేదని, సీఎంఓ కార్యాలయం నుంచి ఆదేశాలు రాగానే మంజూరు ప్రకటించి త్వరలో పనులు ప్రారంభిస్తా మని ఈ సందర్భంగా తెలిపారు.



బ్యాంకు మేనేజర్‌కు నోటీస్ అందజేస్తున్న ఎస్ఐ శిరీష

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:జిల్లాలోని వివిధ మండలాల్లో మారుమూల బ్యాంకులు, ఏటీఎంల్లో దొంగలు డబ్బును దొంగిలించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఎస్ఐ శిరీష తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకు మేనేజర్లకు సూచించారు. మండలంలో బ్యాంకు మేనేజర్లకు మంగళవారం నోటీసులను అందజేశారు. ఈ మధ్య కాలంలో జరిగిన దొంగతనాలను మేనేజర్ల దృష్టికి తీసుకువెళ్లారు.

నేడు పంచాంగ శ్రవణం

ప్రజాశక్తి -నక్కపల్లి :ఉపమాక వెంకన్న ఆలయంలో బుధవారం సాయంత్రం ఉగాది ఆస్థానంలో భాగంగా పంచాంగ శ్రవణం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉగాది ఆస్థానంలో భాగంగా ప్రముఖ వేద పండితురాలు గొట్టుముక్కల గాయత్రీ దేవితో పంచాంగ శ్రవణం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం తీర్థ గోష్ఠి ప్రసాద వినియోగము నిర్వహించడం జరుగుతుందన్నారు.భక్తులందరికీ ఉగాది పచ్చడి అందజేయడం జరుగుతుందన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల ఎన్నిక కమిటీ ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా జవ్వాది నర్సింగరావు, గౌరవ అధ్యక్షులుగా అడిగర్ల సత్యనారాయణ, మండల కార్యదర్శిగా గంట్యాడ అప్పలరాజు, కోశాధికారిగా గిడుతూరి రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కుసర్లపూడి గ్రామం వద్ద డంపింగ్ యార్డ్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. సుమారు పది రోజుల నుండి ఇక్కడే నివసించేవాడు. దీంతో గ్రామస్తులు ఆరా తీయగా తనది మాడుగుల మండలం అని చెప్పేవాడు. అతడు మంగళవారం ఉదయం అనారోగ్యంతో డంపింగ్ యార్డ్ వద్ద మరణించాడు. మృతుడి వివరాలు తెలిస్తే తమకు తెలియజేయాలని ఎస్సై నాగకార్తీక్ తెలిపారు.



జలవనరుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని మంగళవారంఘనంగా నిర్వహించారు. గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ ప్రత్యేక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ రక్షిత జలవనరులు లభించకపోవడం వల్ల ఏటా ప్రపంచంలో 1.4 మిలియన్ల జనాభా మరణిస్తున్నారని, 74 మిలియన్ల మంది వివిధ రకాల రోగాలతో బాధపడుతున్నార్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి నలుగురిలో ఒకరు మాత్రమే రక్షిత నీటిని వినియోగిస్తున్నారని తెలిపారు. సగానికి పైగా ప్రపంచ జనాభా పరిశుభ్రతలేని వాతావరణంలో తాగు నీటిని ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. 2050 నాటికి ప్రపంచ నీటి అవసరాలు 55 శాతం పెరగనున్నాయని, దీనికి గాను జల వనరులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీలో పాల్గొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ టి.లక్ష్మమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సురేష్ కుమార్, టి.మాలతి పాల్గొన్నారు.



గీతంలోప్రపంచనీటి దినోత్సవ అవగాహన ర్యాలీ

24న జాబ్‌మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఈ నెల 24న శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లుజిల్లా ఉపాధి కల్పనాధికారి కె సుధ తెలిపారు. అపోలో హోమ్ కేర్ సంస్థలో హోమ్ కేర్ నర్సు, హోంకేర్ నర్స్ అసిస్టెంట్ పోస్టులు 50 ఖాళీల కొరకు పిసిఎ/ఎంపిహెచ్‌డబ్ల్యు/ బిఎస్‌సి నర్సింగ్ అర్హత కలిగి 18 -40ఏళ్ల వయస్సు గలవారు అర్హులు. అనుభవాన్ని బట్టి రూ.12,500 నుంచి రూ.28,200 వరకు వేతనం చెల్లిస్తారు. అలాగే వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్ షిప్ మేనేజర్ 50 పోస్టులు భర్తీకి ఏదైనా డిగ్రీ, టు వీలర్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన 20-35ఏళ్ల పురుషులు మాత్రమే అర్హులన్నారు.నెలసరి వేతనం రూ 13,500 నుండి రూ.24,500 చెల్లిస్తారు. ముందుగా ncs.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

ఏడాదిలో 486 న్యూరో సర్జరీలు

-త్వరలో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం
-35 స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీ
-ఆరోగ్య శ్రీ పథకంలో పలు ఉచిత వైద్య సేవలు
-విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు



ప్రజాశక్తి-అరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఏడాదిలో 486 న్యూరో సర్జరీలు చేశామని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు వెల్లడించారు. బ్రెయిన్ స్రోక్‌కు సంబంధిత చికిత్సలెన్నో జరిపించామని, ఆర్థోసేవలు, 70మందికి పిఆర్‌డి థెరపీ, హెడ్, మోకాలు ట్రాన్స్‌ప్లాంటేషన్, స్పైనల్ లాప్రోస్కోపీ వంటి సేవలు నిర్వహించామన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, విమ్స్‌కు నిత్యం 600 నుంచి 700 అవుట్ పేషెంట్లు వస్తుంటారని, సగటున 200లకు తక్కువ లేకుండా ఇన్‌పేషెంట్లు వస్తున్నారన్నారు. విమ్స్‌లో ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణ, ఐసీయూ, వెంటిలేటర్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి రోగులొస్తున్నారన్నారు.

త్వరలో 'స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్'

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో విమ్స్‌లో 'స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్' త్వరలో ఏర్పాటు కానుందని, ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయన్నారు. ఆ సెంటర్ విశాఖలో ఏర్పాటైతే ఏపీలోనే అది తొలి సెంటర్ అవుతుందని డాక్టర్ రాంబాబు స్పష్టం చేశారు. వైద్య పరికరాలొస్తే వైద్యం చేసేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకోసం ఓ హాలుతో పాటు 20బెడ్‌లు, పరికరాలు సిద్ధం చేశామన్నారు. విమ్స్‌లో పని చేసేందుకు వైద్యసిబ్బంది ఆసక్తి చూపిస్తుంటారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, అవసరమైన అధునాతన పరికరాలు అందుబాటులో ఉండడమే దీనికి కారణమన్నారు సమయపాలన ఇక్కడ కచ్చితంగా పాటిస్తున్నామన్నారు. సిబ్బంది లంచం తీసుకుంటే ఫిర్యాదివ్వవచ్చని సూచించారు. విమ్స్‌లో త్వరలో సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ కూడా రానుందని తెలిపారు. నగరంలో మరే ఆస్పత్రిలోనూ లేనంతగా ఉచితంగా సేవలు అందుబాట్లోనే ఉంటాయన్నారు. కేథల్యాబ్ సేవలు కూడా రానున్నాయన్నారు. రోగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తు న్నామన్నారు. త్వరలో 35స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల్ని భర్తీ చేస్తున్నట్టు తెలిపారు..

ఆరోగ్య శ్రీ పథక పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

విమ్స్‌లో మరెక్కడా లేని విధంగా ఆరోగ్య శ్రీ పథక పరిశీలనకు 15నుంచి 20మందితో కూడిన ప్రత్యేక వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేశామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. ఆరోగ్య శ్రీలో పూర్తి ఉచితంగానే వైద్య సేవలుంటాయన్నారు. పల్మనాలజీ, చెస్ట్‌ఫిజీషియన్, ఇఎన్‌టీలో కాక్లియర్ ఇంప్లాంటేషన్, జనరల్ మెడిసిన్, వైరల్ జ్వరాలైన మలేరియా, టైఫాయిడ్ తదితర వాటికి సిబ్బంది వైద్య సేవలందిస్తున్నట్టు తెలిపారు. విమ్స్‌లో 33మంది వైద్యులు, 212మంది నర్సులు, 200మంది వైద్య సిబ్బంది, 70మంది కార్యాలయ సిబ్బంది, 40మంది టెక్నీషియన్లు, నలుగురు ఫిజియోథెరపిస్టులు, 70మంది పారిశుద్ధ్య సిబ్బంది, 50మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ సహకారంతో మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రయత్నిస్తున్నామని, అందరూ సహకరించాలని డైరెక్టర్ కె.రాంబాబు కోరారు.

28, 29న జన్ భగీదారి

ప్రజాశక్తి-విశాఖపట్నం: జి-20 ఇండియా ప్రెసిడెన్సీలో రెండవ జి-20 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్‌గ్రూపు సమావేశాలకు (ఐడబ్ల్యుజి) ముందు ఈ నెల 28, 29 తేదీల్లో జన్ భగీదారి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడినట్లు జివిఎంసి పేర్కొంది. ఈ మేరకు ఆ ప్రకటనను మీడియా విడుదల చేసింది. ప్రకటనలో పేర్కొన్నా వివరాలిలావున్నాయి... ఐడబ్ల్యుజి సమావేశం చుట్టూ జరిగే జన్ భగీదారి కార్యక్రమాలలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్, హౌసింగ్, అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంయుక్తంగా నగరాలు ప్రైవేట్ ఫైనాన్స్‌ను ఎలా ఉపయోగించుకోవచ్చనే దానిపై రెండు రోజుల ప్రాంతీయ వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నాయి. భారత జి-20 ప్రెసిడెన్సీ యొక్క 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు' అనే థీమ్-2023, మౌలిక సదుపాయాల ఎజెండాకు టోన్‌ని సెట్ చేస్తుంది. థీమ్ సమానమైన వృద్ధి సందేశాన్ని నొక్కి చెబుతుంది. స్థిరమైన పట్టణ మౌలిక సదుపాయాలను నిర్మించే చర్చల యొక్క కేంద్ర ఎజెండాతో సముచితంగా ముడిపడి ఉంది. ఈ వర్క్ షాప్‌లో జివిఎంసికి చెందిన 70 మందికి పైగా పాల్గొనే అవకాశం ఉంది. కమిషనర్లు, మేయర్లు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, గోవా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, లక్షద్వీప్, పుదుచ్చేరి నుంచి ప్రతినిదులు వచ్చే అవకాశం వుంది.

రెండు రోజుల చర్చల్లో పౌర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రైవేట్ ఫైనాన్సింగ్ అంతర్జాతీయ అనుభవాలకు పరిమితులను చర్చించడం, వినూత్న ప్రాజెక్టుల తయారీ, నగరాల నిధులు, సామర్థ్య నిర్మాణ అవసరాలు, నగరాల కోసం క్రెడిట్ అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ తదితరాలపై చర్చించనున్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గొలుగొండ కేజిబివిలో మంగళవారం కిశోర్ బాలికలకు రక్తహీనత, బాల్యవిహాలపై చర్చా గోష్ఠి నిర్వహించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో పలు అనర్థాలు సంభవిస్తాయని తెలిపారు. పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత దరి చేరదన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ శ్రీగౌరి, కేజిబివి ప్రిన్సిపాల్ సుధ, బిపిఎ కిరణ్, హెల్త్ డిపార్టుమెంట్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

డిసిసిబి డైరెక్టర్‌గా పార్వతి నియామకం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నాతవరం మండలం వైసీపీ నాయకులు అంకంరెడ్డి జమీలు మృతి చెందటంతో ఆయన సతీమణి అంకంరెడ్డి పార్వతిని విశాఖపట్నం డీసీసీబీ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా నియమించడం జరిగిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, విశాఖ సెంట్రల్ బ్యాంక్ పాలకవర్గంలో నియమించినట్లు జీవో కాపీని విడుదల చేశారు. పార్టీ పటిష్టతకు అంకంతరెడ్డి జమీలు ఎన్నో సేవలు అందించారని, ఇటీవల ఆయన మరణించడంతో పార్టీకి పెద్ద లోటు కనిపించిందన్నారు. ఆమె నియామకంపై ఆనందదాయకమని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



జిఒ కాపీని చూపుతున్న ఎమ్మెల్యే గణేష్

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

సిఐటియు గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి నూకేశ్వరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : దేశంలోని అన్ని ప్రయివేట్, ప్రభుత్వ ఉక్కు కర్మాగారాలకు గనులను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలో సమర్థవంతంగా నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు కేటాయించడంలేదని సిఐటియు గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి ఎ.నూకేశ్వరరావు ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 717వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సిఐటియు గాజువాక జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నూకేశ్వరరావు మాట్లాడుతూ, సొంత గనులు లేనందున, స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు వస్తున్నాయన్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు కేవలం రూ.5000 కోట్లు మాత్రమేనని, స్టీల్‌ప్లాంట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల రూపంలో రూ.50 వేల కోట్లకు పైచిలుకు ఆదాయం వచ్చిందన్నారు. ఇంతటి ఘనత సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయిస్తే కేంద్రానికి వచ్చే ఇబ్బంది ఏమిటి అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా అడ్డుకుంటామని స్పష్టంచేశారు. ఈ దీక్షల్లో సిఐటియు, అనుబంధ సంఘాల నాయకులు దాసరి అప్పారావు, పి.నానాజీ, కె.మాలకొండారెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శోభకృత్ నామ సంవత్సర
ఉగాది
ప్రజాశక్తి
విశాఖ ఎడిషన్
25వ వార్షికోత్సవ
ప్రత్యేక అనుబంధం
Advt. Feature

బుధవారం 22-03-2023 | విశాఖపట్నం | 8 పేజీలు

ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ : 25 ఏళ్లు

ఎంతో ఘన చరిత్ర సొంతం - అడుగడుగునా ప్రోత్సాహం



విశాఖ ఎడిషన్ ప్రారంభం సందర్భంగా సంచికను ఆవిష్కరిస్తున్న మోటూరు హనుమంతురావు, తెలకపల్లి రవి, నాటి విశాఖ మేయర్ సబ్బం హరి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖ జిల్లాలో ప్రజాశక్తి ప్రస్థానం మహోన్నతమైనది. ఎంతో ఘన చరిత్ర కలిగినది. జిల్లాలో ప్రజాశక్తి తన ప్రస్థానాన్ని వారపత్రికగా ఆరంభించింది. డెబ్భైలలో పరిమితమైన సర్క్యులేషన్‌తో నడిచింది. అప్పట్లో విశాఖ జిల్లాలో మార్క్సిస్ట్ ఉద్యమం అనేక చీలికలను, విచ్ఛిన్నాలను ఎదుర్కొని, కొత్త ఊపిరులు పోసుకుంది. ఆ ఉద్యమంతోపాటే... దాని అండదండలతో ప్రజాశక్తి కూడా క్రమంగా ఎదిగి, నేడు పత్రికా రంగంలో ప్రముఖ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటూ, రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతోంది.

తొలితరం విలేకరులు

వారపత్రికగా నడిచిన కాలంలో ఉద్యమ వార్తలే ఎక్కువగా వస్తుండేవి. అప్పట్లో కొంతమంది ఉద్యమ నాయకులే వార్తలు పంపేవారు. తర్వాత్తర్వాత అడపాదడపా సిహెచ్.సాల్మన్‌రాజు వార్తలు పంపుతుండేవారు. పాఠకాభిమానులు ప్రజాశక్తి చదవడం కోసం, కొత్త ఆలోచనలతో ఉత్తేజం పొందడం కోసం తపించేవారు. 1981 ఆగస్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా ఆవిర్భవించింది. అనంతరం, సాల్మన్‌రాజునే విశాఖ నుంచి వార్తలు రాయవలసిందిగా పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు ఆదేశించారు. ఆ విధంగా విశాఖ నుంచి ప్రజాశక్తికి తొలి విలేకరి సాల్మన్‌రాజు అని చెప్పవచ్చు. అప్పటికే అనకాపల్లిలో మార్క్సిస్టు ఉద్యమం బలంగా ఉండేది. ముఖ్యంగా రైతాంగ సమస్యలపై పని చేయడం ద్వారా అక్కడ ఉద్యమం బలపడింది. ఈ నేపథ్యంలోనే పత్రిక కూడా అక్కడకు బాగా వెళ్లేది. ఆ ప్రాంత వార్తలు కవర్ చేసేందుకు కామ్రేడ్ పెంటకోట జగన్నాథాన్ని విలేకరిగా నియమించారు. ఆయన 1997 వరకూ స్వయంగా పత్రిక ఏజెన్సీ కూడా నిర్వహించారు.

విశాఖలో సాల్మన్‌రాజు తరువాత పెంటకోట రామారావు కొద్ది సంవత్సరాలు విలేకరిగా పని చేశారు. పత్రిక నానాటికీ అభివృద్ధి చెందుతుండటంతో దీని నిర్వహణకు ప్రకటనలపై ఆధారపడటం అనివార్యమైంది. మొదట్లో కామ్రేడ్ ఎస్.పుణ్యవతి (ప్రస్తుతం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు) ప్రజాశక్తికి ప్రకటనలు సేకరించారు. ఆ తరువాత మర్రిపాలెం ప్రాంతానికి చెందిన మోహన్ అనే యువకుడిని ప్రకటనల సేకరణ కోసం నియమించారు. అతడు తిరగడం కోసం కామ్రేడ్ పుణ్యవతి తన లూనా ఇచ్చేశారు.

పాఠకులకు సకాలంలో అందించేందుకు..

ఆ రోజుల్లో పత్రికను పాఠకులకు సకాలంలో చేరవేయడానికి ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారు. 1981లో జివిఎన్.మూర్తి (రాజు) పేపర్ బాయ్‌గా చేరారు. ఆ తరువాత అదే సంవత్సరం అక్టోబర్‌లో ఆయన పత్రిక ఏజెన్సీ కూడా తీసుకున్నారు. తెల్లవారుజామున 1.30 గంటలకు విజయవాడ నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పత్రికలు వచ్చేవి. వాటిని తీసుకుని రైల్వే స్టేషన్ నుంచి ఇంచుమించు వేపగుంట వరకూ సైకిల్‌పైనే ప్రయాణిస్తూ మూర్తి పత్రికలు పంచేవారు. పత్రికను పాఠకులకు అందించడం కోసమే ఆయన ప్రతి రోజూ దాదాపు 70 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించేవారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇదే విధంగా అనేక మంది పాఠకులకు సకాలంలో పత్రికలు అందించడం కోసం కృషి చేశారు. పత్రిక పంపిణీలో వస్తున్న ఇబ్బందులను గమనించి, పరిష్కరించేందుకు 1984 నుంచి ఎస్.సుధాకర్ బాధ్యులుగా ఉంటూ వచ్చారు.

తొంభైల నుంచి...

పత్రిక అవసరాలు నానాటికీ పెరుగుతుండటంతో ప్రకటనల విభాగాన్ని మరింత బలపరుచుకోవాల్సిన అవసరం కూడా ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో 1992లో జి.సంతోష్‌కుమార్‌ను ఇందుకోసం నియమించారు. ఇదే సమయంలో ప్రకటనల ద్వారా ఆదాయం క్రమంగా పెరుగుతుండటంతో 1994-95లో మరికొంతమంది సిబ్బందిని కూడా నియమించారు. వీరే వార్తలు, ప్రకటనలు సేకరించేవారు. అప్పటి వరకూ సిఐటియు కార్యాలయం నుంచే ప్రజాశక్తి పత్రిక నిర్వహణ కూడా జరిగేది. ప్రత్యేకించి కార్యాలయం ఉండేది కాదు. సిబ్బంది పెరగడంతో విశాఖలో ప్రజాశక్తికి వేరే కార్యాలయం ఏర్పాటు చేయాలని యాజమాన్యం భావించింది. ఆ క్రమంలోనే 1995లో జగదాంబ సెంటర్‌లో వాల్తేర్ రోడ్డులో ప్రజాశక్తి తొలి కార్యాలయం ఏర్పాటైంది. పత్రిక క్రమంగా ఎదుగుతున్న దశలో విలేకర్ల యంత్రాంగాన్ని పటిష్టం చేసుకోవాల్సిన ఆవశ్యకతను యాజమాన్యం గుర్తించింది. అప్పటికే విద్యార్థి ఉద్యమం, సైన్సు ఉద్యమాల్లో పనిచేస్తూ రచయితగా, కవిగా వెలుగులోకి వస్తున్న సత్యాజీ (ప్రస్తుతం ప్రజాశక్తి ఫీచర్స్ పేజీ బాధ్యులు)ని 1996 జనవరిలో విశాఖలో విలేకరిగా నియమించారు. విశాఖ ఉత్తరాంధ్రాకే ప్రధాన కేంద్రం. శ్రీకాకుళం, టెక్కలి, రాజాం, విజయనగరం, బొబ్బిలి, అనకాపల్లి, నర్సీపట్నం, గాజువాక తదితర అన్ని కేంద్రాల వార్తలు విశాఖ వచ్చేవి. విశాఖలో వాటిని కలెక్టు చేసి, ఇక్కడి నుంచి బస్సులో విజయవాడ పంపేవారు. దీనివల్ల వార్తలు సకాలంలో రాని పరిస్థితి ఏర్పడేది. ఒక్కోసారి కవర్ అందక వార్తలు వచ్చేవి కావు. మరీ ముఖ్యమైన వార్తలుంటే విజయవాడకు ఫోన్ చేసి చెప్పేవారు. ఇటువంటి పరిస్థితుల్లో విశాఖలో పిసి సెంటర్ ఏర్పాటు చేయాలని యాజమాన్యం భావించింది. ఈ నేపథ్యంలో విశాఖ పిసి సెంటర్ ఇన్‌ఛార్జిగా టి.ఏడుకొండలు (కొండబాబు)ను విజయవాడ నుంచి ప్రత్యేకంగా విశాఖ పంపారు. 1996 జూన్‌లో పిసి సెంటర్ ఏర్పాటైంది. దీంతో, వార్తలు పంపడంలో కొంత సౌలభ్యం ఏర్పడింది. వార్తలను ఇక్కడే ఎడిట్ చేసి, కంప్యూటర్‌లో కంపోజ్ చేసి, మోడెమ్ ద్వారా వాటిని విజయవాడ పంపేవారు. అలా పంపిన వార్తలను మర్నాడు పత్రికలో చూసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చేది. ఇది విలేకర్లకు కూడా కొత్త ఉత్సాహాన్నిచ్చింది. దీంతో, వారు రాసే వార్తలు కూడా పెరిగాయి. పత్రికలో ఉత్తరాంధ్ర వార్తలకు ప్రత్యేకించి కేటాయించే స్పేస్ తక్కువగా ఉండేది. ఒకపక్క విలేకర్ల నుంచి వార్తలు పెరగడం, స్పేస్ తక్కువగా ఉండటంతో అవి ప్రచురణకు నోచుకొనేవి కావు. అప్పట్లో ప్రతి మంగళవారం విద్యార్థులను, పోటీ పరీక్షల అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని పత్రికతోపాటు దీపిక ప్రత్యేక అనుబంధం ఇచ్చేవారు. ఆ రోజు పత్రికలో కూడా మరో రెండు పేజీలు అధికంగా ఉండేవి. దీంతో, ఉత్తరాంధ్రా విలేకర్లు రాసిన ప్రత్యేక కథనాలు ప్రచురణకు నోచుకునేవి. ఈ అవకాశాన్ని విశాఖ పిసి సెంటర్ సరిగ్గానే సద్వినియోగం చేసుకునేది. ప్రతి ఆదివారం రాత్రి ఒంటి గంట, రెండు గంటల వరకూ స్టోరీల స్వభావం కలిగిన ఐటెమ్స్ ఎడిట్ చేసుకుని కంపోజ్ చేసి విజయవాడ పంపేవారు. అవి గ్యారెంటీగా మంగళవారం పత్రికలో కనిపించేవి. ఇది కూడా ఉత్తరాంధ్ర విలేకర్లకు కొంత సంతోషాన్ని కలిగించింది. క్రమంగా ఉన్న ఎనిమిది పేజీల్లోనే ఒక పేజీని ఉత్తరాంధ్రాకు కేటాయించారు. ప్రతి రోజూ ఉత్తరాంధ్రా స్ట్రిప్‌తో ఈ పేజీ వచ్చేది. ఇది ఇక్కడి పాఠకులకు ఎంతో సంతోషాన్నిచ్చింది. అయినప్పటికీ ఇబ్బందులు వస్తూనే ఉండేవి. అప్పట్లో జగదాంబ ప్రాంతంలో టెలిఫోన్లన్నీ మేన్యువల్ ఎక్స్ఛేంజిలో ఉండేవి. దీనివల్ల తరచుగా ఫోన్ డిస్కనెక్ట్ అవుతూండేది. తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడేవి. దీంతో, కంపోజ్ చేస్తున్న వార్తలు మధ్యలోనే ఒక్కోసారి స్క్రాప్ అయిపోయేవి. వాటిని మళ్లీ కంపోజ్ చేసుకోవాల్సి వచ్చేది. ఇటువంటివాటివల్ల పిసి సెంటర్ ఉన్నప్పటికీ వార్తలు పంపడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి.

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత సబ్సిడీ బియ్యం ధర పెంచారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి రాష్ట్ర బాధ్యుల సూచనలు అందుకుని, విశాఖ జిల్లాలో ప్రజలపై భారాలు మోపకుండా ఆదాయం పెంచుకుందుకు ప్రత్యామ్నాయ మార్గాలు సూచిస్తూ ప్రత్యేక కథనం రాశారు. 1996 ఆగస్టు 15తో మన దేశ స్వాతంత్ర్యం 50వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. దీనిని పురస్కరించుకుని ఉప్పు అమ్ముకుంటూ నగరంలోని పాతబస్టాండులో జీవిస్తున్న పోలయ్య అనే వ్యక్తి జీవితాన్ని ప్రత్యేక కథనంగా రాశారు. అదే సమయంలో పెందుర్తిలో ఒక పేద మహిళ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ఉన్న కథనాన్ని 'ఇదో కన్నీటి కథ...' శీర్షికన ప్రచురించారు. దీనికి పాఠకుల నుంచి స్పందన కూడా వచ్చింది. కొంత మొత్తాన్ని విరాళంగా పంపారు. ఆ మొత్తాన్ని అక్కడి విలేకరి ద్వారా బాధితురాలికి అందజేశారు. 1996లో విశాఖలో జరిగిన సిఐటియు ఆలిండియా జనరల్ కౌన్సిల్ సందర్భంగా ప్రత్యేక సంచికల ద్వారా ప్రజాశక్తి కార్మికవర్గ మన్ననలు అందుకుంది. 1997 సెప్టెంబర్ 14న హెచ్‌పిసిఎల్ విస్ఫోటనం వార్తలను, ప్రత్యేక కథనాలను ఇతర పత్రికలకు పోటీగా ప్రజాశక్తి కూడా ఇచ్చింది. అప్పట్లో ప్రజాశక్తికి ఉన్న విలేకర్లు ఇద్దరు మాత్రమే.

కృషి ఇలా...

ఉద్యమ అవసరాల కోసం... న్యాయవాద వృత్తిని త్యాగం చేసి... ఉద్యమ నాయకుల్లో ఒకరిగా ఉంటూ... ఆ బాధ్యతల్లో భాగంగా ప్రజాశక్తికి తొలుత మార్గదర్శకత్వం వహించిన ఎస్.సుధాకర్ 2018 వరకూ విశాఖ ఎడిషన్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం పత్రిక అవసరాలరీత్యా విజయవాడలోని పత్రిక రాష్ట్ర కేంద్రానికి వెళ్లారు. అతని కాలంలో ప్రజాశక్తిలో ఎంతో మందిని ఉన్నత స్థాయికి ఎదిగారు. ఎంత ఎదిగినా ఒదుగుతూ ఉండాలని పెద్దలు చెబుతుంటారు. ఈ సూత్రాన్ని ఆయన తు.చ తప్పకుండా పాటిస్తారు. ఒక పత్రికకు ఎడిషన్ మేనేజర్ స్థాయిలో ఉన్న వ్యక్తి అవసరమైనపుడు పొద్దున్నే పేపరు పంచుతారంటే చాలామందికి నమ్మశక్యం కాదు. కానీ, ప్రజాశక్తి మేనేజర్‌కు అటువంటి భేషజాలేవీ లేవు. ఎక్కడైనా పత్రిక పంపిణీకి అనుకోని ఇబ్బంది ఏర్పడినా సుధాకర్ అక్కడి వాలిపోయేవారు. ఆయనే స్వయంగా రంగంలోకి దిగి పేపరు పంపిణీ చేసేవారు.

విశాఖ ఎడిషన్ ప్రారంభం

పాఠకులకు మరింత చేరువ కావాలనే ఆశయంతో విశాఖపట్నం నుంచి కూడా పత్రిక ప్రచురణ ప్రారంభించాలని ప్రజాశక్తి యాజమాన్యం నిర్ణయించింది. ఫలితంగా 1997 నవంబర్ 7న విశాఖ ఎడిషన్ ప్రారంభమైంది. ఆనాటి సభకు ఊహించనంతగా ప్రజాశక్తి అభిమానులు రావడం చూసి, వేదికపై ఉన్న అతిథులు ఎంతో ఆశ్చర్యానికి గురయ్యారు. నాడు వేదికపై నుంచి ప్రసంగించిన వక్తలంతా ప్రజాశక్తి మరింతగా అభివృద్ధి సాధిస్తుందని చెప్పడం విశేషం. అప్పటివరకూ ప్రజాశక్తికి జిల్లాలో మార్గదర్శకులుగా ఉన్న సుధాకర్‌ను ఎడిషన్ మేనేజర్‌గా నియమించారు. ఎడిషన్ ప్రారంభమయ్యాక విశాఖపట్నం జిల్లాకు ఒక పేజీ ప్రచురించేవారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కలిపి ఉత్తరాంధ్ర పేరుతో వేరే పేజీ ప్రచురించేవారు. క్రమంగా విశాఖ జిల్లాను విశాఖ సిటీ, విశాఖపట్నం జిల్లా పేజీలుగా విభజించారు. అలాగే, ఉత్తరాంధ్రా పేజీని శ్రీకాకుళం, విజయనగరం జిల్లా పేజీలుగా విభజించి, ఏ జిల్లా వార్తలు ఆ జిల్లాకి వెళ్లే ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే మూడు జిల్లాల్లోనూ విలేకర్ల యంత్రాంగం కూడా బలపడింది. ప్రజాశక్తిని అన్ని మండలాలకూ విస్తరించాలన్న లక్ష్యంతో విలేకర్లే ఏజెన్సీ నిర్వహించాలనే నిబంధన విశాఖ జిల్లాలో అమలు జరిగింది. ఇది సత్ఫలితాలను ఇచ్చింది. జిల్లాలోని ప్రతి మండలానికీ ప్రజాశక్తి వెళ్లేది. అప్పట్లో ప్రజాశక్తి ఇంతగా విస్తరించడం ఇతర పత్రికల్లో పెద్ద సంచలనం కలిగించింది. 2000 సంవత్సరం మే 19న శ్రీకాకుళంలోనూ, 2001 మే 9న విజయనగరంలోనూ కంప్యూటర్‌లతో సబ్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. వార్తలను మరింత వేగంగా పాఠకులకు అందించే లక్ష్యంతో 2003-04లో విశాఖ జిల్లాలోని గాజువాక, నర్సీపట్నం, పాడేరు, అనకాపల్లి కేంద్రాల్లో ప్రత్యేకించి పిసి సెంటర్లు ఏర్పాటయ్యాయి. అలాగే, ఈ కాలంలోనే శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ, పలాస పట్టణాల్లోనూ, విజయనగరం జిల్లాలోని పార్వతీపురంలోనూ పిసి సెంటర్లు ఏర్పడ్డాయి. 2003 అక్టోబర్ నుంచి విశాఖ సిటీ, విశాఖపట్నం జిల్లాలకు జిల్లా అనుబంధాలు ఏర్పాటయ్యాయి. 2004 ఫిబ్రవరి నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కూడా జిల్లా అనుబంధాలు ఏర్పాటయ్యాయి. డిజిటల్ కెమెరాలు, పెరుగుతున్న అవసరాలు, పాఠకుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాశక్తి అదనపు కంప్యూటర్లు కూడా సమకూర్చుకుంది. 2009 డిసెంబరు 18న కొరటాల సత్యనారాయణ భవన్ (విశాఖ ఎడిషన్ కార్యాలయం)కు శంకుస్థాపన జరిగింది.

రంగుల్లో పత్రిక - నూతన కార్యాలయం - ప్రింటింగ్ ప్రెస్

2013 మే 28న పత్రిక రంగుల్లో రావడం, నూతన భవనం ప్రారంభం, ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకోవడం ఒకేసారి జరిగాయి. ఆధునిక టెక్నాలజీతో కూడిన (డైరెక్టుగా ప్లేటు) సిటిపి యంత్రం అందుబాటులోకి వచ్చింది. విశాలమైన భవనంలో ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటైంది. ప్రస్తుతం ఎం.వెంకటేశ్వరరావు ఎడిషన్ మేనేజర్‌గా కొనసాగుతున్నారు.

విశాఖ నుంచి శ్రీకాకుళం ఎడిషన్ ఆవిర్భావం

2014 ఏప్రిల్ 1 నుంచి విశాఖ ఎడిషన్ నుంచి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు వేరుపడ్డాయి. ఈ రెండు జిల్లాలతో శ్రీకాకుళం ఎడిషన్ ఏర్పడింది. విశాఖ జిల్లాలో పత్రిక ఇంతటి అభివృద్ధి సాధించడం వెనుక ప్రజాశక్తి అభిమానులు, శ్రేయోభిలాషులు హార్థికంగా, ఆర్థికంగా ఇస్తున్న సహకారం మరువలేనిది. అనుక్షణం ప్రజలకే అంకితమయ్యే విధంగా సూచనలు, సలహాలు ఇస్తూ, వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నవారు లేకుంటే ప్రజాశక్తి ఈ అభివృద్ధి సాధించేది కాదు. ఇతర పత్రికలతో పోటీ పడే స్థాయికి ఎదిగేదీ కాదు. సాధించింది తక్కువేనని నమ్ముతూ, మరింత ముందడుగు వేసేందుకు ప్రజాశక్తి అహరహం శ్రమిస్తూనే ఉంటుంది.

మారిన పరిస్థితుల్లో..

కోవిడ్ నేపథ్యంలో పత్రికా రంగంలో పలు మార్పులు సంతరించుకున్నాయి. రాసి స్కాన్ చేసి పంపే స్థితి నుంచి, పిసి సెంటర్ల ద్వారా వార్తలు పంపే పద్ధతి నుంచి విలేకర్లంతా కొత్త మార్గంలోకి వచ్చారు. స్మార్ట్ ఫోన్లలోనే వార్తలు టైపు చేసి నేరుగా డెస్క్‌కు పంపిస్తున్నారు. దీంతో క్రమేపీ పిసి సెంటర్లు అవసరం తగ్గింది. కోవిడ్ కష్టకాలంలో ప్రజాశక్తి సహా అన్ని పత్రికల పేజీలు తగ్గాయి. అయినప్పటికీ అన్ని వార్తలను ఆకట్టుకునేలా ఇచ్చేందుకు ప్రజాశక్తి కృషి చేసింది. కోవిడ్ తీవ్రత తగ్గి, ఆర్థిక కష్టాల నుంచి బయటపడటం, జిల్లాల పునర్విభజన జరిగి నేపథ్యంలో జిల్లా టాబ్లాయిడ్‌ను పునరుద్ధరించింది. ప్రస్తుతం విశాఖ, అనకాపల్లి జిల్లాలకు 8 పేజీలతో కలర్ టాబ్లాయిడ్‌ను, అల్లూరి జిల్లాకు బ్రాడ్ షీట్ రెండు పేజీలను ప్రచురించడం జరుగుతోంది. పెద్ద పెద్ద పత్రికలు కూడా టాబ్లాయిడ్ ప్రచురించని ఈ పరిస్థితుల్లోనూ ప్రజాశక్తి యాజమాన్యం సాహసించి టాబ్లాయిడ్‌ను ప్రచురిస్తూ పాఠకుల మన్ననలు అందుకుంటోంది.



విశాఖ ఎడిషన్ తొలి సంచిక మెయిన్ పేజీ

ప్రకృతి వసంతగానం.. ఉగాది



శోభకృత్ ఆగమనం నేడే..

ఆకులన్నీ రాలిపోతాయి. చెట్లన్నీ మోడువారతాయి. రాలిన ఆకులు ఎండిపోయి, గాలివాటుకు అటోఇటో ఎగిరిపోతూ ఉంటాయి. అది శీతల శిశిరం మిగిల్చిన దృశ్యం. అదేచోట - మోడువారిన చెట్ల కొమ్మల్లో కొత్త చివుళ్లు చిగురిస్తాయి. లేలేత ఆకులు నవనవలాడుతూ పరవశిస్తాయి. గుబురు కొమ్మల్లోంచి గండు కోయిల కూహూకూహూ గానం వినిపిస్తుంది. ఇది వసంతం తీసుకొచ్చిన ఆశావహ దృశ్యం. ఒక శోభ అదృశ్యమైన చోట, మరొక ఆశ అవతరిస్తుంది. ఆకు రాలిన చోట కొత్త చివురు పలకరిస్తుంది. ఈ ఆశలు మోసులెత్తే సందర్భమే ఉగాది. తెలుగు వారి సంవత్సరాది. ఈ ఉగాది నామ సంవత్సరం శోభకృత్. ఈ నేపథ్యంలో ఈ పర్వదిన విశిష్టతను, ఉగాది సంబురాన్ని ఓసారి తెలుసుకుందాం రండి.

ప్రజాశక్తి - విశాఖపట్నం


చాలా పండగలు ప్రకృతిలోంచే ప్రభవిస్తాయి. మనిషికి, ప్రకృతికి ప్రాథమికంగా ఉన్న అనుబంధాన్ని అవి చాటి చెబుతాయి. ప్రకృతి తొలి నుంచీ మనిషికి ఆకలి తీర్చే ఆదరువు. బతుకు పాఠాలను విడమర్చి చెప్పే గురువు. ప్రకృతిలోని ప్రతి చెట్టూ, పుట్టా, వాగూ వంకా మాట్లాడతాయి; వినే మనసు ఉంటే. ప్రతి పిట్టా, పువ్వూ, మబ్బూ, మానూ సంభాషిస్తాయి, అర్థం చేసుకొనే మనిషి ఉంటే.

ప్రకృతిలో మన బంధం తరతరాలది. భూమ్మీద తొలి జీవి నడయాడిన కాలం అంత పాతది. మనిషి నేర్చుకున్న జ్ఞానమంతా ప్రకృతిలోనిదే! ప్రకృతిలో ఇమిడి ఉన్న కార్యాకారణ సూత్రాలే మనకు బతుకు పాఠాలు. ప్రకృతిపరమైన, వ్యవసాయ సంబంధమైన ప్రతి పండగలోనూ మనిషికి ప్రకృతితో ముడిపడి ఉన్న అనుబంధం కనిపిస్తుంది. అలా చూసినప్పుడు ఉగాది అక్షరాలా ప్రకృతి పండగ. ఉగాది వేళ పల్లవించే ప్రతి మార్పులోనూ మన జీవితానికి అన్వయించే పాఠం ఒకటి అంతర్లీనంగా ఇమిడి ఉంటుంది. పరికించే చూస్తే... ఉగాది జీవితాన్ని నిర్వచించే పండుగ. జీవితాన్ని నిర్మించే పండుగ.

షడ్రుచుల ఉగాది పచ్చడిలో జీవిత పరమార్థం

ఉగాదికి ప్రత్యేకంగా తయారు చేసే పచ్చడి జీవిత పరమార్థాన్ని విడమర్చి చెబుతుందని అంటారు. సుఖదు:ఖాలు, కోపతాపాలు, ప్రేమాభిమానాలు, అభినందనలూ అవమానాలూ వంటివి ఎవరి జీవితంలోనైనా సహజమే! ఆరు రుచుల సమ్మేళనంగా అలరించే ఉగాది పచ్చడి... అలాంటి అనుభవాలకు ప్రతీకగా అభివర్ణిస్తారు. ఉగాది వేళకు ప్రకృతిలోనే పచ్చడికి అవసరమైన దినుసులు సిద్ధంగా ఉంటాయి. పంట చేలో చెరుకు గడ పక్వానికి వచ్చి ఉంటుంది. తోటలోనో, ఇంటి పెరట్లోనో చిన్ని చిన్ని నక్షత్రాల్లాంటి పూల గుత్తులను దిగేసుకొని వేపచెట్టు కనిపిస్తుంది. లేలేత ఆకుల మధ్య టెంక కట్టని దశలో మామిడి గుత్తులు వేలాడుతూ ఉంటాయి. విరగ్గాసిన చింతచెట్ల నుంచి అప్పటికే కొత్త చింతపండు వెదురు గంపల్లోకి చేరి ఉంటుంది. ముప్పేట తిరిగిన కొబ్బరి, పక్కాగా పండిన అరటి, కొరికితే పిండైపోయే వేపిన శనగపప్పు... అన్నీ కొత్తకొత్తగా ఉంటాయి. ఈ దినుసులన్నిటికీ ఉప్పు కూడా జోడించి, సరైన పద్ధతిలో సమపాళ్లలో కలిపితే ఉగాది పచ్చడి ఊరిస్తూ సిద్ధమవుతుంది. ఉగాది కవిత్వంలాగానే ఉగాది పచ్చడి మీదా బోలెడు జోకులూ, కార్టూన్లూ ఉన్నాయి. అదంతా సృజనకారుల అతిశయమే తప్ప, ఉగాది పచ్చడి వల్ల ఉత్పన్నమయ్యే పేచీ ఏమీ లేదు.

హాయిగా ఆస్వాదించగలిగితే ఉగాది పచ్చడిలో ఉన్న ఆనందమే వేరు. ఇంకే వంటకంలోనూ, ఆహార పదార్థంలోనూ తారసపడని రుచి ఉగాది పచ్చడిది. తీయతీయగా, పుల్లపుల్లగా, చేదుచేదుగా.... కలగలపి చవి చూపే సందర్భం ఇది. చెంచాడు పచ్చడి నోట్లో వేసుకోగానే... తొలితొలిగా నాలిక్కి తీపి స్ఫురిస్తుంది. ఆ వెంటనే పులుపు పలకరిస్తుంది. వగరు కూడా ఉన్నానని గుర్తుచేస్తుంది. పంటికింద చిక్కిన వేపమొగ్గను అదాటున కొరికితే, చేదు పలకరించి పరాక్రమిస్తుంది. 'అయ్యో, చేదు' అనుకొని– ఊసేయబోతే మిగతా రుచులూ నేలపాలవుతాయి. చేదు అనుకొని వదిలేయబోతే, తీపి కూడా దూరమవుతుంది మరి! అన్ని రుచులూ కలగలిసిన పచ్చడిని ఆస్వాదించటమే అప్పుడు చేయాల్సిన పని. తీపి కోసం చేదును స్వీకరించాలి. పులుపులోని పులకింత కోసం, వగరులోని పొగరునూ ఆహ్వానించాలి. గెలుపు కోసం ఓటమిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. రేపటి సుఖం కోసం నేడొక కష్టాన్ని భరించాల్సి ఉంటుంది. ఆరు రుచులు కలగలిసిన ఉగాది పచ్చడి మనకు బోధించే జీవిత పరమార్థం ఇదే!



శిశిరం తరువాత వసంత శోభ

ఉగాది వేళ పచ్చడిలోనే కాదు; ప్రకృతిలోనూ అలాంటి పాఠమే ఉంటుంది. శిశిరం సెలవు తీసుకొని, కాలంలో కలిసిపోతుంది. వసంతం ఆగమిస్తుంది. ఆకులు రాలిన కొమ్మల్లో లేలేత చివుళ్లు తలెత్తుతాయి. ఎర్రెర్రగా, లేలేతగా తళతళలాడతాయి. చిరుగాలుల తాకిడికి మిలమిల మెరుస్తూ ఆకులు కనువిందు చేస్తాయి. చూస్తుండగానే మోడువారిన చెట్లు కొత్త ఆకుల గుబర్లతో కొంగొత్తగా నవనవలాడతాయి. శీతల రాత్రులు, మంచు కురిసే ఉదయాలూ – మాయం అయిపోతాయి. నులివెచ్చని సూరీడు ప్రకృతికి గోరువెచ్చని హాయిని ప్రసాదిస్తాడు. కొత్త గాలులు పల్లవిస్తాయి. ఆకులు రాలిన వేప విచిత్రంగా తెల్లని పూగుత్తులు విరగకాస్తుంది. జేగురురంగు ఆకుతో కనువిందు చేసే మామాడిచెట్లు – పిందెలను పొదుపుకొని ఇంతింత కాయలను అలంకరించుకుంటుంది. శిశిరాన్ని చూసి నిరుత్సాహపరితే – వసంతాల వేళ ఇన్ని హాయిల ఆనందహేలను ఆస్వాదించగలమా? వ్యక్తి జీవితంలోనైనా, సామాజిక పరిణామాల్లోనైనా – ఇలాంటి ఎగుడు దిగుళ్లు సహజం. మనం ఆనందించే మార్పూ ఉంటంది. ఆశ్చర్యపోయే విషాదమూ ఉంటుంది. ఆకులు రాల్చిన శిశిరం శాశ్వతంగా ఉండిపోదు. ఆకులన్నీ రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది అన్న కవి వాక్యంలోని ఆశాభావం ఇదే!

ప్రకృతినిండా వసంతగానం!

ఉగాది ఏతెంచిన తరుణాన ప్రకృతి అంతా పచ్చగా పరవశిస్తుంది. అందుకు తగ్గట్టుగానే జీవుల్లోనూ వసంతోత్సాహం వెల్లివిరుస్తుంది. గుబురు కొమ్మల్లో దాగి దాగి గండు కోయిల కుహూకుహూ గానం చేస్తుంది. లేత చిగుళ్లను తింటూ వసంత కాలానికి ఒక శబ్ద సౌందర్యాన్ని జత చేస్తుంది. తరతరాలను ఒకే రకమైన అనుభూతితో ముడిపెట్టే ప్రకృతి సహజ సంబంధం ఈ కోయిళ్ల కోలాహలం.

మన సమాజం పూర్తిగా వ్యవసాయ ప్రధానంగా సాగినప్పుడు– ఉగాది కాలం మొత్తం గొప్ప తీరుబాటు సమయం. సంక్రాంతికి పంటలన్నీ ఇంటికి చేరేవి. కొద్దోగొప్పో అపరాల పంటలు పొలాల మీద ఉండేవి. ఉగాదికి ప్రధానమైన వ్యవసాయ పనులు అయిపోయి, పొలాలు ఖాళీగా ఉండేవి. అది రైతులకు మమ్మరమైన పనుల నుంచి పుష్కలమైన విరామం దొరికే కాలం. ఆ విరామ తరుణంలో కుటుంబాల్లోని యుక్తవయస్కులకు పెళ్లిళ్లు.. ఆ సందర్భాన పిన్నలకు, పెద్దలకు సందళ్లు. ఇంటిముందూ, వీధుల్లో పెద్దపెద్ద తాటాకు పందిళ్లు. ముమ్ముందు ముదిరే ఎండలకు ఆ పందిళ్లే చలువ కేంద్రాలు. ఆటపాటలకు, కబుర్లూ కాలక్షేపాలకు ఆరామాలు. వ్యవసాయం గాడి తప్పాక, అనేక ఆధునిక వ్యాపకాలూ, వృత్తులూ అనుభవంలోకి వచ్చాక– ఈ క్రమం కొంత మారింది. అయినా, పల్లెల్లో ఇప్పటికీ ఈ వాతావరణం ఎంతోకొంత మిగిలిఉంది.

పంచాంగ శ్రవణం.. పార్టీల గమనం

ఉగాది రోజున పచ్చడికి ఎంత ప్రాధాన్యం ఉందో పంచాంగ శ్రవణానికీ అంత ప్రాముఖ్యం ఉంది. ఆ రోజున ఏడాది మొత్తం ఎలా నడుస్తుందో పంచాంగ కర్తలు చెప్పటం ఆనవాయితీగా వస్తోంది. వానలు ఎలా కురుస్తాయి? ఏయే పంటలు పండుతాయి? వంటి సంగతులను వివరిస్తారు. విజ్ఞానం ఇంతగా పెరిగిన దశలో వర్షాల రాక, సేద్యంలో మెలకువల గురించి చెప్పటానికి నేడు అనేక విభాగాలు ఉన్నాయి. అయినప్పటికీ ఒక తంతులా పంచాంగ శ్రవణం నడుస్తూనే ఉంది. రైతుల వెతలూ కతలూ ముడిపడి ఉన్నది పంచాంగంతో కాదని మనకు అర్థమవుతూనే ఉంది. ఇప్పుడు పంచాంగ శ్రవణాలు ప్రహసనంగా మారిపోయాయి. రాజకీయ పంచాంగాలకైతే ఒకదానికి ఇంకొకటి పోలిక లేకుండా ఒక్కో పార్టీ కార్యాలయంలో ఒక్కో రకం పంచాంగాలు నడుస్తున్నాయి. మన పూర్వతరాల వారు తమ అనుకూలత, అవసరాల్లోంచి ఉగాది వంటి పండుగలను జరుపుకొంటే– మారిన పరిస్థితుల్లో మనం వాటినే మక్కికి మక్కి అనుసరించటం అశాస్త్రీయం. ప్రకృతి పట్ల అవగాహన, ప్రకృతితో సమన్వయం, పర్యావరణ స్పృహ, ప్రకృతి ప్రత్యక్షంగా, పరోక్షంగా నేర్పే పాఠాలను అన్వయించుకోవటం– విజ్ఞత. ఆ పరిధిని, పరిమితిని గుర్తెరిగి, ఉగాదిని మనం ఆస్వాదించాలి.

రైతు సంతోషమే ...నిజమైన ఉగాది

పరమార్థాలను పక్కన పెట్టి, పర్వదినాలను జరుపుకుంటే అది వట్టి తంతు మాత్రమే అవుతుంది. ఇప్పటి రైతు పరిస్థితి కొన్ని వేల సంవత్సరాల క్రితం నాటిది కాదు. అంతా సవ్యంగా సాగిపోయే స్థితి లేదు. సాగునీరు, పెట్టుబడి, ఎరువులు, మందులు, వాటి ధరలూ, దిగుబడి, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటివన్నీ ఆధునిక కాలపు అవసరాలు. వీటిని పంచాంగం తీర్చదు, ప్రభుత్వమే పట్టించుకోవాలి. పట్టించుకునేలా ప్రభుత్వాలూ వ్యవవహరించటకపోవటం మరొక ధోరణి.

రైతులను నిర్వాసితులను చేసి, పంటభూములను బడా కంపెనీలకు కట్టుబెట్టటం మరొక విపరీతం. వీటిని అర్థం చేసుకొని, అడగగలిగిన, అడ్డుకోగలిగిన చైతన్యం రైతుల్లో రావాలి! రైతు శ్రమించి, వడ్డిస్తున్న వరిధాన్యాలనే మనం భుజిస్తున్నాం కాబట్టి, మనందరం అండగా నిలవాలి. అప్పుడే రైతుకు నిజమైన ఉగాది. దేశానికి బలమైన పునాది.



జి 20 సదస్సుకు మహానగరం ముస్తాబు










రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జి20 సదస్సుకు విశాఖ మహానగరం ముస్తాబవుతోంది. సదస్సుకు వచ్చే అతిధులు మెచ్చే విధంగా విశాఖ నగర అందాలను తీర్చిదిద్దుతున్నారు. సువిశాలమైన సముద్ర తీర ప్రాంతం గల మహానగర అందాలు ముచ్చటగొలిపేలా, అతిధులను ఆకర్షించే విధంగా సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు మాట్లాడుతూ, విశాఖ నగరంలో సుందరీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. జి20 సదస్సుకు వచ్చే అతిథులుకు నగరంలో నగరంలో జివిఎంసి చేపడుతున్న పలు ప్రాజెక్టుల వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తామన్నారు.


పి.రాజాబాబు, జివిఎంసి కమిషనర్





ప్రజాశక్తి విస్తృత సేవలు

- విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా పలుచోట్ల కార్యక్రమాలు



ఫకీర్‌తకియాలో స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కొద్ది కాలంగా సంస్థ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ప్రజాశక్తి సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయనగరం మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఎ.రమణి హాజరై మాట్లాడారు. రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. రక్తదానం ఎవరు, ఎప్పుడు చేయవచ్చు, సేకరించిన రక్తాన్ని ఏ విధంగా విభజిస్తారు, ఉపయోగిస్తారు అన్న విషయాలను వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. గౌరవ అతిథిగా సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హాజరయ్యారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు ప్రజాశక్తి ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ శివనాగేంద్రరెడ్డి, ప్రజారోగ్య వేదిక నాయకులు టి.కామేశ్వరరావు, ప్రజాశక్తి బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను ఉమ్మడి విశాఖ జిల్లాలోని చిట్టివలస, అంజయ్యనగర్, ఫకీర్‌తకియా, నర్సీపట్నం, రోలుగుంట, కణితి ప్రాంతాల్లో ప్రజాశక్తి సిబ్బంది పంపిణీ చేశారు. పరీక్షల సమయంలో భయాందోళన వీడాలని, ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.



రక్తదానం చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

ఉగాది ఆఫర్లతో మార్కెట్ జోరు



ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

ఉగాది రోజున కొత్త వస్తువులు కొనుగోలు చేస్తే మంచిదనే సెంటిమెంటు తెలుగు ప్రజల సెంటిమెంట్‌ను వ్యాపార వర్గాలు క్యాచ్‌ చేసుకుంటున్నాయి. జనం సంగతెలా ఉన్నా వ్యాపార వర్గాల్లో ఎక్కడ లేని ఉత్సాహం తొణికిసలాడుతోంది. భారీ డిస్కౌంట్లు ప్రకటించి ప్రజలను ఆకర్షిస్తున్నాయి. దీంతో నగరంలో డిస్కౌంట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. బంగారు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ సామగ్రి, బట్టలు, వాహనాల దుకాణాలు డిస్కౌంట్లు ప్రకటించాయి. మనసును కట్టిపడేసే రంగుల్లో కొత్త వాహనాలు విపరీతంగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వివిధ సంస్థలు కొత్త మోడల్స్ ప్రవేశ పెడుతున్నాయి. పాత మోటార్ బైకులు, కార్లను షోరూమ్‌కు అప్పగించేసి, అదనంగా డబ్బు చెల్లించి హుషారుగా కొత్త వాహనాలతో వెళ్లే వారి సంఖ్య నగరంలో పెరుగుతోంది. మోపెడ్, మోటారు వాహనాలు అందులో సింహభాగాన్ని ఆక్రమిస్తున్నాయి. కొత్త వాహనాలకు వాయిదాల్లో అప్పు ఇచ్చేందుకు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు సైతం ముందుకు వస్తున్నాయి. వీరుకూడా వాహనాల కొనుగోలుదారులకు ప్రత్యేకమైన ఆఫర్లు ఇస్తున్నారు. కొన్ని షో రూముల్లో నిర్వాహకులు వాహనాల కొనుగోలుపై రూ.5 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నారు. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్‌లు, హీటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకాలు కూడా ఊపందుకుంటున్నాయి. వీటిపై ఆకర్షణీయ మైన రాయితీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు వారంటీ ఇస్తున్నారు. పాత ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుని కొత్త వాటిని మార్చే పద్ధతి ఉండడంతో, నగరవాసులు కొత్త ఎలక్ట్రానిక్ సామగ్రిని కొనుగోలు చేయడానికి విపరీతమైన ఆసక్తి కనబరుస్తున్నారు. ఖరీదైన సెల్ ఫోన్ కూడా రూ.2 వేల వరకు తగ్గించి ఆఫర్లు ఇస్తున్నారు. ఏ పండగ వస్తే దాని పేరు చెప్పి డిస్కౌంట్లు వర్షం కురిపించే వస్త్ర దుకాణాల యజమానులు మరింత చక్కగా ఉపయోగించుకుంటున్నారు. మహిళల మనసు చెదిరే రీతిలో రాయితీలు ప్రకటిస్తున్నారు. ప్రముఖ వ్యాపార సంస్థలు ప్రతిరోజూ డ్రా తీసి, గెలుపొందిన వారికి బహుమతులు అంద జేస్తున్నాయి. బంగారు దుకాణాలు గ్రాముకు రూ.50 వరకు డిస్కౌంట్ ప్రకటిస్తున్నాయి. కొన్ని బంగారు దుకాణాలలో కొనుగోలు చేసిన ఆభరణాల విలువను బట్టి విలువైన గిఫ్టులు అందిస్తున్నారు. నగరంలోని ప్రముఖ బంగారు దుకాణాలు ఆకర్షణీయమైన డిజైన్ల ఆభరణాలు రప్పించి, మహిళల మనసులను కొల్లగొడుతున్నాయి. చిన్నపిల్లల వస్తువులు కొనుగోలులో కూడా ఆఫర్లు ఉన్నాయి. నగరంలోని వారే కాకుండా నగర శివారు, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. నగరంలో ఎక్కడ చూసినా వినియోగదారులతో సందడిగా కనిపిస్తోంది. బేకరీలు, స్వీట్ దుకాణాలు కూడా కిటకిట లాడుతున్నాయి.



ఔషధ విలువల సమ్మేళనమే ఉగాది పచ్చడి

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఔషధ విలువల సమ్మేళనమే ఉగాది పచ్చడి. వేప పువ్వు, లేతమామిడి కాయలు, పచ్చి మిర్చి, అరటిపండు, కొత్త చింతపండు, కొత్త బెల్లం, మిరియాల పొడి, ఉప్పు మిశ్రమమే ఉగాది పచ్చడి. చేదుగా, తియ్యగా, వగరుగా, ఘాటుగా, పులుపుగా, షడ్రుచుల సంగమం ఉగాది పచ్చడి. మనిషి జీవితంలో జరిగే ఒడిదుడుకులకూ, సుఖ దుఃఖాలకూ దీన్ని ప్రతీకగా చెబుతుంటారు. వేపపువ్వు చేదు అనుకుంటాం గానీ, మన ఆరోగ్యాన్ని కాపాడే అమృతం అది. ఈ పువ్వులో విటమిన్ ఎ, కాల్షియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నాయి. వాతం, జ్వరం దగ్గును దరిచేరనివ్వదు. వేపాకులు, వేపపువ్వు క్రిమిసంహారిణి కావడం వల్ల అమ్మవారు (పొంగు) పోసినపుడు పక్కలోనే ఉంచుతాం. వేప చిగుళ్లు నూరి మాత్రలుగా చేసి, పసుపు కలిపి మింగిస్తున్నాం. గజ్జి, కుష్టు వంటి వ్యాధుల్నీ ఇది హరిస్తుందని ఆయుర్వేదం చెప్తోంది. జీర్ణక్రియను సజా వుగా నిలు పుతుంది. చర్మ వ్యాధుల్ని అరిక ´డుతుంది. మామిడిలో విటమిన్ 'సి', 'ఎ'లతో పాటు మరెన్నో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. పేగు క్యాన్సర్ ఉన్న వారికి మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. చెటమ రూపంలో పోతున్న శక్తిని ఉప్పు తిరిగి శరీరానికి అందిస్తుంది. ఎముకలకు పుష్టిని ఇస్తుంది. తీపి చక్కెర, బెల్లంలో ఉంటుంది. బెల్లం ఆరోగ్యానికి శ్రేయస్కరం. రక్తాన్ని వృద్ధి పరుస్తుంది. కాలేయాన్ని శుద్ధిచేసి కామెర్ల వ్యాధిని నివారిస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది. మిరియాల కషాయం గురించి తెలిసిందే. అది కఫవాతాలను పోగొట్టి దగ్గు, శ్లేష రోగాలను అరికడుతుంది. పులుపునిచ్చే చింతపండులో విటమిన్ 'డి', 'సి' పుష్కలంగా ఉంటాయి. ఇది పైత్యాన్ని, అరుచిని పోగొడుతుంది.

తెలుగువారి తొలి పండగ ఉగాది

ప్రజాశక్తి - కలెక్టరేట్, విశాఖ

రుతువులు మారుతుంటాయి.. వాటితో పాటే అవి మనకు పంచిచ్చే అనుభూతులూ మారుతుంటాయి. అందుకే ప్రకృతి ఎప్పుడూ నిత్య నూతనంగా ఉంటుంది. శిశిరంలో మోడైపోయిన చెట్లన్నీ వసంతంలో చిగుళ్లు తొడిగి కొత్త సింగారాలొలుకుతుంటాయి. పచ్చగా కళకళలాడుతుంటాయి. రుతువుల్లో వసంతం మనోహారమైనదీ.. ఆహ్లాదకరమైనదీనూ. అందుకే సంవత్సర ఆరంభానికి దీన్నే కొలమానంగా తీసుకుని తొలి రుతువుగా చెబుతారు. అలాంటి వసంతంలో వచ్చే తొలి మాసం చైత్రం. తిథుల్లో తొలి గౌరవం పాడ్యమిది. చైత్ర శుద్ధ పాడ్యమే యుగాది. అన్నీ తొలిసారిగా వచ్చే ఆ రోజే తెలుగువారి తొలి పండగ ఉగాది.

తెలుగు సంవత్సరాలు 60. వాటి వెనుక ఓ కథ ఉందంటారు పండితులు. నారద మహాముని ఒకసారి విష్ణు మాయ వల్ల స్త్రీగా మారి, ఓ రాజును పెళ్లాడతాడు. వారికి 60 మంది పుత్రులు జన్మిస్తారు. ఓసారి ఆ రాజు పుత్రులతో యుద్ధానికి వెళితే అంతా చనిపోతారు. అప్పుడు ప్రార్థించిన నారదుడిని విష్ణువు కరుణిస్తాడు. నీ పిల్లలు 60 సంవత్సరాలుగా కాల చక్రంలో తిరుగుతుంటారని వరమిస్తాడు. అలా వచ్చినవే మన తెలుగు సంవత్సరాల పేర్లు అని పండితులు చెబుతుంటారు.

తెలుగు సంవత్సరాల పేర్లు

1.ప్రభవ, 2.విభవ, 3.శుక్ల, 4.ప్రమోదూత, 5.ప్రజాత్పత్తి, 6.అంగీరస, 7.శ్రీముఖ, 8.భవ, 9.యువ, 10.ధాత, 11.ఈశ్వర, 12.బాహుధాన్య, 13.ప్రమాధి, 14.విక్రమ, 15.వృష, 16.చిత్రభాను, 17.స్వభాను, 18.తారణ, 19.పార్థివ, 20.వ్యయ, 21.సర్వజిత్, 22.సర్వధారి, 23.విరోధి, 24.వికృతి, 25.ఖర, 26.నందన, 27.విజయ, 28.జయ, 29.మన్మధ, 30.దుర్మిఖి, 31.హేవళంబి, 32.విలంబి, 33.వికారి, 34.శార్వరి, 35.ప్లవ, 36.శుభకృత్, 37.శోభకృత్, 38.క్రోధి, 39.విశ్వావసు, 40.పరాభవ, 41.ప్లవంగ, 42.కీలక, 43.సౌమ్య, 44.సాధారణ, 45.విరోధికృత్, 46.పరీధావి, 47.ప్రమాదీచ, 48.ఆనంద, 49.రాక్షస, 50.నల, 51.పింగళ, 52.కాళయుక్తి, 53.సిద్ధార్థి, 54.రౌద్రి, 55.దుర్మతి, 56.దుందుబి, 57.రుధిరోద్గారి, 58.రక్తాక్షి, 59.క్రోదన, 60.అక్షయ.

తెలుగు నెలలివి

1.చైత్రం, 2.వైశాఖం, 3.జ్యేష్టం, 4.ఆషాడం, 5.శ్రావణం, 6.భాద్రపదం, 7.అశ్వయిజం, 8.కార్తీకం, 9.మార్గశిరం, 10.పుష్యం, 11.మాఘం, 12.ఫాల్గుణం.



పల్లెలో ఉగాది

రణగొణ ధ్వనుల పట్టణ జీవనం
ఏనాటికి దొరకు ప్రశాంత చిత్తం
పట్టణాల మోజువదలి సాగిపోదాం
పల్లె జీవన సౌరభం ఆస్వాదిద్దాం!!

ఆశ నిరాశల పంచాంగ శ్రవణం
తికమల పలుకుల పాండిత్యం
గలిబిలి చింతల తరుణోపాయం
తొలకరి పలుకుల వసంత
శోభాయమానం!!

మోడువారిన చెట్లు చిగురించుట
తథ్యం
విలవిలలాడిన ప్రకృతి
సంతసించుట నిక్కం
వెలవెల జీవితాల వెలుగు సత్యం
గజిబిజి గతులు కుదుటపడు
ఏనాటికైనా!!
చెరకు పానకం మాతృమూర్తి
పలకరింపులు.. వేప చేదు రుచి
తండ్రి కనిపించని దయాగుణం
అరటి పండ్లు, చింత పులుపు మన
తోబుట్టువులు
సహజ సంపదలు మానవ జీవన
మధురసుధలు!!

గోమయ కళ్ళాపి జల్లి, రంగుల
రంగవల్లులు తీర్చి
పశుసంపద నలంకరించి,
ప్రేమమీర నాదరించి
గున్న మామిడి నీడ సేదదీరి,
కోయిల రాగాల పరవశించి
ప్రకృతి కాంతన మమేకమై, ఈ
పుడమిన ఫరిఢవిల్లుదాం!!

మరదళ్ల రుసరుసలు, అల్లుళ్ల
బుసబుసలు
అత్తమామల కలవరింతలు,
తాతమామ్మల బుజ్జగింపులు
కొత్త జంటల చిలుక పలుకులు,
పాత జంటల నసనసలు
ఉమ్మడి జీవిత భిన్నరుచులు, ఉగాది
పచ్చడి మేళవింపులు!!

వేకువ సమయాన ఆలయ
గుడిగంటలు
లేగ దూడల కమ్మని పిలుపులు
గో దేవత ఉష్ణధారల మధుర
శబ్దాలు
గ్రామ దేవత సిగలోని సువాసనల
విరిపూలు!!

అరకొర సంపదలైన అప్యాయతలు
మెండు
సంపూర్ణ సంప్రదాయాల తేనెల
ఊటల విందు
పట్టణాల ఏమున్నది, పల్లెలోన
పండుగ కనువిందు
రండి కలసి సాగుదాం! ఉగాదిని
స్వాగతిద్దాం!!

– డాక్టర్ దేవులపల్లి పద్మజ

కాగితం పడవలు

ఉగాదికి ఊరంతా
కవిసమ్మేళనాల వాసనే...
కంఠాలు తెగిన కోయిలల చేత
కమ్మగా పాడించాలని కవుల
ప్రయత్నం...
ఆయువు తీరిన వసంతానికి
పద్యాల పూలజడలు అల్లుతున్నారు
చేదును మాత్రమే మిగుల్చుకున్న
ఉగాది పచ్చడికి
రుచి, వాసనలేని మాటల
తలపాగాలను చుట్టుతున్నారు
గర్భస్రావం పొందిన మామిడి పూతల
నుండి
పుట్టని ఉగాది బిడ్డకు లాలిపాటలు
పాడుతున్నారు
తాకట్టుపెట్టిన మనసు మైదానాల
మీద
అవాస్తవాల గంజాయి మొక్కల్ని
పెంచుతున్నారు
క్రమం తప్పకుండా తాళం తప్పుతున్న
కవితా గానాలు
వేదిక సాక్షిగా మనసాక్షికి
మరణశాసనం రాస్తున్నాయి
ప్లాస్టిక్ ముఖాలతో వేలాడుతున్న
పూలదండలన్నీ
పేదరికం వృద్ధిరేటుకు జండాలు
వూపుతున్నాయి
తెలుగు కండువా, పంచెలతో హాజరైన
రాజకీయం
రంభలా కవులందరి చూపుల్ని
కొనుగోలు చేస్తోంది
అబద్దాల కవితల్ని కరవాలాలుగా
విసిరిన ప్రతిసారి
నేరుగా వాస్తవాల గుండెల్ని
చీల్చుకుంటూ వెళ్తున్నాయి
చప్పట్ల హోరుకు తుళ్లిపడుతున్న
కవితాగానాలు
అశాస్త్రీయ సాహిత్య శవపేటికల్ని
మోస్తున్నాయి
సాహిత్య సేద్యంతో సంబంధంలేని
కలాల గళాలన్నీ
కాలం కోర్టుముందు దోషుల్లా
నిలబడుతున్నాయి
శాలువా, జ్ఞాపికల ఆనందంలో
మురిసిపోతున్న నవ్వులన్నీ
జాతరలో తలలు తెగిన
మేకపోతులవుతున్నాయి
ఉగాదికి మాత్రమే కవిజన్మను కొత్తగా
ఎత్తే గళాలన్నీ
తిరిగి ఏడాది నిద్రకు సమాధులు
నిర్మించుకుంటున్నాయి
ప్రజాసాహిత్యపు అంచుల రుచుల్ని
ఎరగనివాడు ఎవడైనా
రేపటి చరిత్రలో దిష్టిబొమ్మగా
మాత్రమే మిగిలిపోతాడు
శ్రోతల ఓపికల్ని తీవ్రంగా
గాయపరిచిన కవితా గానాలన్నీ
తడిస్తే మునిగిపోయే
కాగితం పడవలు మాత్రమే...!

– డాక్టర్ కెజి.వేణు

ప్రకృతి పండగ ఉగాది

ఆశావహ దృక్పథానికి పర్వదినం



ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆది అంతాలు లేనిది కాలం. నిరంతరంగా, నిర్విరామంగా సాగుతూనే ఉంటుంది భూభ్రమణం. 'ఇదిగో... ఇది మొదలు.. అదిగో.. అది చివర' అని చెప్పడానికి కాలానికి విభజన రేఖలు లేవు. కానీ, ఇతరత్రా ఏ జంతుజాలానికీ అవసరం లేని కాల విభజన, కాల నిర్ధారణ మనిషికి అవసరం. ఏ కాలంలో ఏం జరిగిందో, ఏ రోజున ఏం జరగాలో... మననం చేసుకోవడానికి, మార్గనిర్దేశం చూపడానికీ కాలగణన అవసరం. ప్రకృతిలో జరిగే మార్పులనే ప్రామాణికంగా తీసుకొని 'ఇది ఏడాది మొదలు' అన్న లెక్క ఆరంభమైంది. ఆ ఆరంభ సంరంభమే సంవత్సరాది. తెలుగు లోగిళ్లలో చిందాడే ఉగాది. 'శిశిరంలో వాడినా, ఓడినా వసంతం నాటికి కొంగొత్తగా చివుళ్లెత్తే చైతన్యమే జీవితం' అని చాటే ప్రకృతి పండగ ఇది.

శిశిరంలో ఆకులన్నీ రాలిపోతాయి. చూస్తుండగానే చెట్లు మోడువారిపోతాయి. కొమ్మల మధ్యలోంచి చూస్తే.. అంతా శూన్యమే కనిపిస్తుంది. చూపునిండా వెలితి మేఘాలు ఆవరిస్తాయి. కింద రాలిపడిన ఆకులు ఎండిపోయి గాలివాటుకు ఎటెటో చెల్లాచెదురైపోతాయి. అన్నాళ్లూ కళకళలాడిన చెట్టు వెలవెలాపోయినందుకు కలవరపడిపోదు. విలవిల్లాడదు. బోరుమని విలపించదు. నిరాశను కౌగలించుకోదు. నీరసాన్ని నెత్తికెత్తికోదు. రాలిన ఆకుల స్థానే కొత్త చివుళ్లను మొలకెత్తడానికి సమాయత్తమవుతుంది. ఎండలు దండిగా దండెత్తుతున్నా సరే... భూమి పొరల్లోంచి చెమ్మను నెమ్మదినెమ్మదిగా సంగ్రహించి... లేలేత చివుళ్లకు ప్రాణధారగా అందిస్తుంది. అలా అందిన శక్తిని అందుకొని లేలేత ఆకులు సరికొత్తగా పరవశిస్తాయి. జీవకళతో పరిమళిస్తాయి. మోడువారిన చెట్టు నిండా హరితవర్ణపు పతాకాల్లా ఆకులు రెపరెపలాడతాయి. గుబురు కిరీటాలను ధరించిన ధీరశిఖరంలా చెట్టు నిండుగా, కనువిందుగా కనిపిస్తుంది. అలాంటి గుబురు కొమ్మల్లో దాక్కొని దాక్కొని కోయిల కూహూ.. కూహూ రావాలు చేస్తుంది. అదొక ప్రకృతి సందోహం! గాలి సవ్వడికి గొంతును సవరించుకొని లేలేత ఆకులు సాగించే గానలహరి! అంతా అయిపోయింది అన్న చోట 'ఇంకా ఎంతో ఉంది' అని చాటి చెప్పే సందర్భం ఈ వసంతం. శూన్యం ఆవరించింది అనుకున్నప్పుడు అనంతంగా ఆశలు మోహరించే సంకేతం ఈ ఉగాది. ప్రతికూలతలు పొటమరించిన చోట అనుకూలంగా తొలకరించే ఆశావహ దృక్పథానికి అర్థవంతమైన పర్వదినం ఇది.



స్వచ్ఛమైన ప్రకృతి పండగ

ఉగాది అచ్చమైన, స్వచ్ఛమైన ప్రకృతి పండగ. తొట్టతొలి కాలంలో ఇప్పుడన్ని తంతులూ తతంగాలూ లేని పల్లెవాసుల వేడుక. శిశిరమంతా చలిగాలుల వెల్లువ. చైతన్యం సుప్తావస్థలోకి ముడుచుకుపోయే వాతావరణం. పొద్దువాలగానే చలిపులి దాడి చేస్తుంటే- ఎవరి ముసుగులోకి వాళ్లు దూరిపోయి దాక్కొనే పరిస్థితి! చుట్టూ ఉన్న పరిసరాలు కూడా నిశ్శబ్దాన్ని ఆవహించి, స్తబ్దుగా కూచుంటాయి. అలాంటి వాతావరణం మాయమై- పచ్చని ఆకుల రెపరెపలతో ప్రకృతి గొంతు విప్పేది వసంతంలోనే. మామిడి గుత్తులు, వేపపూల సొగసులూ, చింతబొట్టల కణకణధ్వనులూ, చురుగ్గా వీచే చిరుగాలుల అల్లర్లూ... పరిసరాలకు పరవశం కలిగిస్తాయి. జనావళి మది మూలల్లో సంతోష సరాగాలను తట్టి తట్టి లేపుతాయి. ఆ ఆనందపు సందోహం ఆవరించటం వల్లే కోయిళ్లు గొంతెత్తుతాయి. కవులు ప్రతిస్పందించి, కవిత్వంగా ప్రతిధ్వనిస్తారు. ఆకులు రాలిన చోట.. ప్రకృతి పాడిన పాట ఇది.

సేద్యానికి శుభారంభం!

ప్రకృతిలో 'కొత్తొ'చ్చినట్టు కనిపించే సహజ సందడిని ఒక్కోచోట ఒక్కోలా జరుపుకుంటారు. మనది వ్యవసాయ ప్రధానమైన సమాజం కాబట్టి- ఇక్కడి పర్వదినంలో వ్యవసాయ సంబంధ పద్ధతులే కనిపిస్తాయి. ఉగాదిని ఒక కాలమానంగా పెట్టుకొని- వ్యవసాయ ఆరంభానికి రైతులు సన్నద్ధమవుతారు. కొత్తగా కాడినో, మేడినో తయారు చేయించటం; పలుపో, కాడితాళ్లో సిద్ధం చేయడం, పొలాల్లోకి గెత్తం తోలటం, మళ్లలో సాళ్లు వేయడం... వంటి పనులు చేపడతారు. ఇదంతా వ్యవసాయ పనుల్లోకి ట్రాక్టర్లు రాకముందు సాగిన సంప్రదాయం. ఇప్పుడు పరిస్థితి మారింది. అయినా, వ్యవసాయ ఆరంభానికి అవసరమైన ఏదొక ప్రక్రియను చేపట్టడం ఆనవాయితీగానే ఉంది. భూమి కౌలు, తనఖా వంటి ఒప్పందాలు ఈ కొత్తామావాస్య కాలంలోనే కుదుర్చుకుంటారు.



పచ్చడిలో జీవిత పరమార్థం!

ఉగాది అనగానే గుర్తొచ్చేది ఆరు రుచుల పచ్చడి. తీపి, చేదు, పులుపు, కారం, ఉప్పు, వగరు. ఇన్ని రుచులు కలగలిసిన వంటకం ఇది తప్ప ఇంకేదీ మనం చవిచూడం. పచనం లేకుండానే ప్రకృతిలో దొరికిన దినుసులను యథాతథంగా వాడడం కూడా ఇందులో ప్రత్యేకం. జీవితంలో కష్టాలూ సుఖాలూ సంతోషాలూ విషాదాలూ కలగలిసి ఉంటాయని ఈ పచ్చడి పరమార్థంగా పెద్దలు చెబుతారు. దీనిని 'జీవితం అంటే ఇంతే' అన్న వేదాంత అర్థంలో కాక- 'జీవితం అంటే ఇవి కూడా' అన్న వ్యవహారిక అర్థంలో తీసుకోవాలి. కష్టకాలంలో కొట్లాడి, పోరాడి దానిని అధిగమించాలి. దుఃఖసమయంలో దానిలో మునిగి వైరాగ్య గీతాలు పాడుకోకుండా దాన్నుంచి బయటపడే దారి కోసం అన్వేషించాలి. సుఖసంతోషాలు ఉన్నప్పుడూ అంతే! అవి శాశ్వతమూ సౌఖ్యమూ అన్నట్టు ప్రవర్తించకూడదు. జీవితమంటే శిశిరంలాంటి ప్రతికూలతతో పోరాడి.. వసంతం వంటి చైతన్యంలోకి ప్రయాణించడం. ముడుచుకున్న ముసుగులోంచి ప్రభవించి.. కొమ్మల్లోని కోయిల పాటలా ప్రవహించడం. అర్థం చేసుకుంటే- ఉగాది తాత్పర్యం ఇదే! పచ్చడి పరమార్థమూ ఇంతే!!.

పర్యావరణ హననం వద్దు

ఇప్పుడు మనం చాలా చిత్రమైన సందర్భాల్లో ఉన్నాం. చెట్లను నరుక్కుంటూ వసంతం కోసం ఎదురుచూస్తున్నాం. కాంక్రీటు అరణ్యాలు నిర్మించుకుంటూ కోకిల పాట కోసం చెవులొగ్గుతున్నాం. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ పచ్చడిలోని ప్రకృతి పరమార్థం గురించి పరవశిస్తున్నాం. వ్యవసాయాన్ని పాడె ఎక్కిస్తూ- రైతే రాజు అని కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇక్కడ మనం అంటే మనమే అని కాదు. మన మౌనాన్ని మద్దతుగా చేసుకొని- మౌలిక వనరులను, పద్ధతులను మింగేస్తున్న ఘనుల గురించే ఈ మాట. ప్రకృతి వనరులను వ్యాపార పరమార్థంగా స్వాహా చేస్తున్న శక్తులూ యుక్తులూ ఈ కాలంలో బాగా పెరిగాయి. ఫలితంగా నదులు కాలుష్యం.. చెట్టు చేమలు అదృశ్యం. పంటపొలాల్లో భవనాల నిర్మాణం.. ఎక్కిన కొమ్మనే నరుక్కుంటున్న తెలివితక్కువ వ్యవహారం. ఈ పర్యావరణ హననం మీద మనం గట్టిగా పట్టించుకోవాలి. లేకుంటే- భవిష్యత్తులో వేపచెట్టును ఇంటర్నెట్లో వెతుక్కోవల్సి ఉంటుంది. కోయిల పాటను కంప్యూటర్లోంచి వినాల్సి ఉంటుంది. రాజపూజ్యాలూ, అవమానాల లెక్కలు మనకు కాదు; మన చుట్టూ ఉన్న చెట్టూగుట్టలకు కూడా చూడాలి. వాటిని కైంకర్యం చేస్తున్న ఘనుల ఆదాయ అంతస్తులు ఎలా పెరుగుతున్నాయో లెక్కించాలి.

పంచాంగం చెప్పని భవిష్యత్తు

ఉగాది పూట మనం తెలుగు భాష గురించి ఘనంగా మాట్లాడుకుంటాం. తెలుగు సంస్కృతి గురించి గొప్పగా కీర్తించుకుంటాం. ఇది ఒక్కటే సరిపోదు ఇప్పుడు. అవసరమైన దానిని నిలబెట్టుకోవడం కోసం నిరంతరం ఆలోచించాలి. పరిష్కార మార్గాలు అన్వేషించాలి. ప్రకృతికి, మనిషికి దూరం పెరగకూడదు. ఎంత పెరిగితే అంత అనర్థం. అలాంటి అనర్థాలకు తావు లేని ప్రతిరోజూ వసంతాల ఉగాది అవుతుంది. పర్యావరణాన్ని హరించే ధోరణులు దారుణంగా పెచ్చుపెరిగితే ఉగాది కూడా శిశిరంలోని చీకటి శీతల రాత్రిలాగానే ఉంటుంది.

మనకు ఏది కావాలో ఏ పంచాంగమూ చెప్పదు. మనకు మనమే చెప్పుకోవాలి... 'ప్రకృతిని కాపాడుకుంటాం.. మంచి భవిష్యత్తును నిర్మించుకుంటాం.' అని.

గ్రామాల్లో కొత్త అమావాస్య సందడి

ఘనంగా నూకాలమ్మ పండగ మహోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఫాల్గుణ బహుళ అమావాస్య రోజున కొత్త సంవత్సరానికి వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. కాబట్టే ఆ రోజుని కొత్త అమావాస్య అంటారు. పూర్వ కాలం నుండి కొత్త అమావాస్య రోజున నూకాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా నూకాలమ్మ అమ్మవారి పండగలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

నూకాలమ్మ పండగ అంటే మొదటిగా గుర్తుకొచ్చేది ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా పిలవబడే అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారే. కొత్త అమావాస్య సందర్భంగా అనకాపల్లి నూకంబిక అమ్మవారి నెల పండుగ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతరను వైసిపి నాయకులు దాడి జైవీర్ ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ జాతరలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించారు. 21న కొత్త అమావాస్య పండగను ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 19న నెల పండుగ నిర్వహిస్తారు. ఆ రోజు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ మొక్కులు, ముడుపులు తీర్చుకుంటారు. పండుగ సందర్భంగా నెలరోజుల పాటు భక్తులకు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు శీతల పానీయాలు మజ్జిగ పంపిణీ చేస్తున్నాయి. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరుగుదొడ్లు, చిన్న పిల్లలకు ఫీడింగ్ ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు.

జిల్లాలోని దేవరాపల్లి మండలం ఎం.అలమండ, బుచ్చయ్యపేట మండలం కెపి అగ్రహారం, కె.కోటపాడు మండలం కొరువాడతో పాటు గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో నూకలమ్మ అమ్మవారి పండగలు ఘనంగా నిర్వహించారు. కెపి.అగ్రహారం నూకాలమ్మ పండగను కేపీ అగ్రహారం, కొండపాలెం, పెద్ద మదిన, గున్నంపూడి, పైడమ్మపేట తదితర గ్రామాల ప్రజలు తమ గ్రామదేవతల పండగ వలె నిర్వహించుకుంటారు. ఎం.అలమండలో నూకలమ్మ పండగ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు.



అనకాపల్లి నూకాలమ్మను దర్శించుకోవడానికి క్యూలైన్లలో నిల్చున్న భక్తులు

పది మంది కలయికే.. పండగ పరమార్థం

ప్రజాశక్తి - విశాఖపట్నం : తెలుగు సంవత్సరాలు 60. వరుస క్రమం ప్రభవతో మొదలై అక్షయతో ముగుస్తుంది. ఇప్పుడు కొత్త సంవత్సరం పేరు శోభకృత్. వరుస క్రమంలో 36వది. మళ్లీ 2083లో వస్తుంది. ఇక ఉగాది అంటేనే పంచాంగాలు. ఇవి మనదేశంలోని అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండవు. కొందరిది సూర్యమాన పద్ధతైతే, మరికొందరిది చాంద్రమాన పద్ధతి. పండగల నిర్వహణకు సంబంధించిన తిథుల గణనలో వ్యత్యాసాలూ, ఆ సందర్భంగా పంచాంగకర్తల మధ్య వాదోపవాదాలూ మనం తరచూ చూస్తూనే ఉంటాం. వీటితో సంబంధం లేకుండా ఏదొకరోజు జనం పండగలను జరుపుకుంటూనే ఉన్నారు. ఇక్కడ పదిమంది కలిసి చేసుకొనే సందడి ముఖ్యం తప్ప ఆ సందర్భంగా తలెత్తే అశాస్త్రీయ వాదాల నిర్దేశాలు కావు. తరచూ ఆచరణలో జనం దీనిని నిరూపిస్తూనే ఉన్నారు.

ఉగాది పంచాంగంలో రాజపూజ్యాలు, అవమానాలు, ఆదాయ వ్యయాలు అంటూ పేరును బట్టి- ఈ ఏడాది ఎవరికి ఎలా ఉండబోతుందో చెబుతారు. ఉపాధి, ఉద్యోగం, ఉత్పత్తి మీద ఆధారపడే ఆదాయం ఉంటుందని మనందరికీ తెలుసు. పేర్లను బట్టి పరిస్థితి అనుకుంటే- అంబానీ అప్పుడప్పుడు పేదోడు అవ్వాలి.

మన పక్కింటి పార్వతీశం కనీసం ఒక్కసారన్నా కోటీశ్వరుడు అయితీరాలి. కానీ, అలా జరగదు. కాబట్టి- అదంతా ఒక తంతు. ప్రకృతి పండగ ఉగాదిని నేల నుంచి ఊహల్లోకి, చేతన నుంచి చాదస్తంలోకి మళ్లించిన తతంగం.